ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల జిల్లా వార్తలు 5
శనివారం 4 అక్టోబరు 2025



రక్తపుగట్టు



దేవరగట్టు బన్ని ఉత్సవంలో హింస చెలరేగింది. దేవుడి దక్కించుకునే క్రమంలో గ్రామాల మధ్య జరిగిన కర్రల పోరులో ఇద్దరు మృతిచెందగా మరో 90 మంది దాకా గాయపడ్డారు. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. దసరా రోజున జరిగిన బన్ని ఉత్సవం రక్తసిక్తంగా మారింది. గురువారం అర్ధరాత్రి స్వామి, అమ్మవారి వివాహం తర్వాత దేవతామూర్తుల ఊరేగింపు మొదలైంది. ఉత్సవమూర్తులను తమ గ్రామాలకు తీసుకెళ్లేందుకు రెండు వర్గాల ప్రజలు పోటీ పడ్డారు. మాళ మల్లేశ్వర స్వామి బన్ని జైత్రయాత్రలో రెండు వర్గాల ప్రజలు కర్రలతో ఘర్షణకు దిగారు. ఉత్సవమూర్తులను తీసుకెళ్లే విషయంలో పోటీపడటంతో హింస మొదలైంది.

దేవరగట్టు బన్ని ఉత్సవంలో సాగిన కర్రల సమరం



తిమ్మప్ప (ఫైల్) ఆంజనేయులు (ఫైల్)



- దేవరగట్టు బన్ని ఉత్సవాల్లో పగిలిన తలలు

- తలపగిలి ఒకరు, గుండెపోటుతో మరొకరు మృతి
- 90 మందికి గాయాలు, ఆరుగురి పరిస్థితి ఆందోళనకరం
- ఉత్సవమూర్తుల కోసం గ్రామాల మధ్య కర్రల సమరం
- సంప్రదాయం పేరిట ఆటవిక ఆచారం

వివరాలు 6లో





గాయపడిన భక్తుడిని తీసుకెళ్తున్న సహాయకులు



ఉత్సవాలను పరిశీలిస్తున్న కర్నూలు ఎస్పీ



కాగడాలతో వెళ్తున్న నెరణికి గ్రామస్థులు



గొరవయ్యల ప్రదర్శన



ఉత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



ఉత్సవమూర్తులను తీసుకెళ్తున్న భక్తులు

సాగర్‌కు కొనసాగుతున్న నీటి విడుదల



శ్రీశైలంలో 10 గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

శ్రీశైలం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయంలో 10 రేడియల్ క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. ఒక్కో గేటు 10 అడుగుల ఎత్తుకు తెరిచారు. స్పిల్‌వే గుండా 2,76,160 క్యూసెక్కులు దిగువ సాగర్‌కు విడుదల చేశారు. ఎగువ జూరాల గేట్లు, విద్యుత్ ఉత్పత్తి, సుంకేసుల, హంద్రీ నుంచి మొత్తం 2,86,325 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి డ్యాం నీటిమట్టం 884 అడుగులు కాగా నీటి నిల్వ సామర్థ్యం 210 టీఎంసీలుగా ఉంది. శ్రీశైలం కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాలు ఉత్పత్తి అనంతరం 65,784 క్యూసెక్కులు విడుదల చేశారు.

నంద్యాలకు స్వచ్ఛాంధ్ర రాష్ట్ర స్థాయి అవార్డు

- 51 జిల్లా స్థాయి అవార్డులు

నంద్యాల టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛాంధ్ర అవార్డులో భాగంగా నిర్వహించిన సర్వేలో నంద్యాల జిల్లాకు ఒక రాష్ట్ర స్థాయి, 51 జిల్లా స్థాయి అవార్డులు వచ్చినట్లు కలెక్టర్ రాజకుమారి తెలిపారు. ఆమె మాట్లాడుతూ స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర (ఎస్ఏఎస్ఏ) కార్యక్రమం కింద తొలి సారి రాష్ట్రంలో నిర్వహించిన సమగ్ర పరిశుభ్రత సర్వేలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ వంటి వాటిని పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 24 విభాగాల్లో స్వీయ మదింపు నిర్వహించగా రాష్ట్రస్థాయి బృందాలు పరిశీలించి వీటిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇందులో జిల్లా స్థాయిలో 51 అవార్డులు వచ్చినట్లు తెలిపారు. ఈనెల 6న జిల్లా కేంద్రంలో ఈ అవార్డులతో ఘనంగా సన్మానించి అందజేయనున్నట్లు తెలిపారు. పాఠశాలలు, ఆసుపత్రులు, బస్‌స్టేషన్లు, పరిశ్రమలు, రైతు బజార్లు, వంటి విభాగాల్లో ప్రకటించినట్లు తెలిపారు.

నిజరూపాలంకరణలో భ్రామరి



భ్రమరాంబాదేవి అలంకారంలో అమ్మవారు



పూజల్లో పాల్గొన్న కలెక్టర్, ఈవో దంపతులు



ఆలయంలో దేవదాయ శాఖ కార్యదర్శి

- నందివాహనంపై ఆది దంపతుల విహారం
- పూర్ణాహుతితో ముగిసిన ఉత్సవాలు
- కన్నుల పండువగా తెప్పోత్సవం



పుష్కరిణిలో తెప్పోత్సవం

శ్రీశైలం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా విజయదశమిని పురస్కరించుకుని గురువారం చివరి రోజు స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు జరిగాయి. అమ్మవారు భ్రమరాంబదేవి నిజరూపాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ దేవి అష్ట భుజాలను కలిగి, శూలం, బాకు, గద, ఖడ్గం, విల్లు, డాలు, పరిఘ మొదలైన ఆయుధాలను ధరించి దర్శనమిచ్చారు. స్వామి, అమ్మవార్లకు నందివాహనసేవను అశేష భక్తుల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామిఅమ్మవార్లకు ఆలయ పుష్కరిణి వద్ద తెప్పోత్సవం వైభవంగా కొనసాగింది. ఉత్సవాల చివరిరోజు ఉదయం అమ్మవారి యాగశాలలో చండీయాగ పూర్ణాహుతి, స్వామివారి యాగశాలలో రుద్రయాగ పూర్ణాహుతి కార్యక్రమాలు జరిపారు. అనంతరం చండీశ్వరస్వామికి మల్లికార్జున గుండం వద్ద అవబుధస్నానం నిర్వహించారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో ఉన్న శమీ వృక్షానికి శాస్త్రోక్తంగా పూజాదికాలు నిర్వహించారు. నందివాహనంపై ఆశీనులైన స్వామి, అమ్మవార్లను శమీ వృక్షం వద్దకు తోడ్కొని వచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

నందివాహన సేవ

దసరా ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు అమ్మవారిని నవదుర్గా అలంకరణలలో ఒకటైన భ్రమరాంబాదేవి నిజరూపాలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఆలయ ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో శ్రీనివాసరావు, ఆలయ అధికారులు, ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా తెప్పోత్సవం: ఆలయ పుష్కరిణిలో సాయంత్రం తెప్పోత్సవం జరిపారు. ముందుగా ఆలయ ప్రాంగణంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ రాజగోపురం నుంచి ఊరేగింపుగా తోడ్కొని వచ్చి ప్రత్యేక తెప్పపై అధిష్టించారు. మంగళవాయిద్యాల నడుమ వేదమంత్రాలతో తెప్పోత్సవం వీనులవిందుగా సాగింది. వివిధ రకాల పుష్పాలు, విద్యుత్ దీపాలంకరణతో తెప్పోత్సవం ఆద్యంతం ఆకట్టుకుంది.

మల్లన్న సేవలో దేవదాయ శాఖ కార్యదర్శి

శ్రీశైల మల్లికార్జున స్వామి, భ్రమరాంబికా దేవిని రాష్ట్ర దేవదాయ శాఖ కార్యదర్శి డాక్టర్ హరి జవహర్‌లాల్ గురువారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈఓ ఎం.శ్రీనివాసరావు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ప్రాకార మండపంలో కార్యదర్శికి ఆలయ మర్యాదలతో సత్కరించి, స్వామివారి ప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.

170.14 ఎకరాలకు ఆమోదం

- ఒక్కొక్క ఎకరాకు రూ. 6.25 లక్షలు ఖరారు
- డ్రైవర్లకు అండగా 'ఆటో డ్రైవర్ల సేవ'
- జిల్లాలో 10,006 మందికి లబ్ధి

నంద్యాల, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శుక్రవారం అమరావతిలోని సచివాలయంలో జరిగిన 31వ రాష్ట్ర కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలకు ఆమోదం పడింది. జిల్లాలోని పిన్నాపురం ప్రాజెక్టుతో పాటు 'ఆటో డ్రైవర్ల సేవ' పథకం అమలుకు సంబంధించి ఆమోదం తెలిపి నిధులు కేటాయించారు. సోలార్ ప్రాజెక్టుతో పాటు డ్రైవర్లకు ఎంతో ప్రయోజనకరంగా మారినట్లైంది.

పిన్నాపురం ప్రాజెక్టు కింద..

పాణ్యం నియోజకవర్గంలోని పిన్నాపురంలో 'పిన్నాపురం ప్రాజెక్టు' కింద సోలార్ కోసం సుమారు 6వేల ఎకరాలు కేటాయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా విడతలవారీగా 90శాతం ఎకరాల భూమికి అప్పగించి సోలార్ వినియోగంతో విద్యుత్ ఉత్పత్తి, జల, పవన విద్యుత్ ఉత్పత్తి సాగుతోంది. ఈ నేపథ్యంలో తాజాగా జరిగిన కేబినెట్ సమావేశంలో ఇదే పిన్నాపురంలో మెస్సర్స్ గ్రీన్‌కో ఏపీ01 ఐఆర్ఈపీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు 170.14 ఎకరాలకు ఒక్కొక్క ఎకరాకు.. రూ. 6.25లక్షలు చొప్పున అప్పగించింది. ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టు స్థాపన కోసం కేటాయించినట్లు పేర్కొన్నారు. గతంలో 2020 జూన్ 13న ఎకరా రూ.5లక్షలు చొప్పున నిర్ణయించగా.. వివిధ కారణాలతో సదరు ఫైల్ ఆగిపోయింది. కూటమి రాకతో కలెక్టర్ రాజకుమారి మరోమారు సదరు ఫైల్‌ను పునఃపరిశీలన చేసి ఎకరా.. రూ.6.25 లక్షలు చొప్పున సదరు సంస్థ ప్రభుత్వానికి అందజేయాలని నివేదిక పంపారు. తాజాగా కేబినెట్‌లో పైవిధంగా ఆమోదం తెలిపింది.

జిల్లా వ్యాప్తంగా 10,006 మందికి..

కూటమి ప్రభుత్వం శుక్రవారం అమలు చేయనున్న 'ఆటో డ్రైవర్ల సేవ' ఆయా వర్గాల డ్రైవర్లు అండగా ఉండే విధంగా కేబినెట్‌లో ఆమోదం తెలిపారు. అధికార లెక్కల ప్రకారం సదరు పథకం కింద జిల్లావ్యాప్తంగా 10,006 మందికి లబ్ధి చేకూరనుంది. వారికి రూ.15.09 కోట్లు అందనున్నాయి. ఒక్కొక్కరికి రూ. 15వేలు చొప్పున నేడు ఆయా డ్రైవర్ల ఖాతాలో జమ చేయనుంది.

శ్రీశైలం దేవస్థానం బోర్డులో 16 మందికి చోటు



జి.లక్ష్మీశ్వరి | బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి | సింధూశ్రీ | మురళీధర్ | భరద్వాజశర్మ

నంద్యాల/ డోన్ టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులుగా 16మందికి అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ట్రస్టుబోర్డులో శ్రీశైలానికి చెందిన చిటా బొట్ల భరద్వాజ్‌శర్మ, గుల్ల గంగమ్మ, ఎమ్మిగనూరుకు చెందిన రేఖాగౌడ్, నంద్యాలకు చెందిన సింధుశ్రీ, పాణ్యంకు చెందిన శివమ్మ నియమితులయ్యారు. డోన్ మండలంలోని ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన జి.లక్ష్మీశ్వరికి చోటు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం జీవో విడుదల చేసింది. డోన్ నియోజకవర్గం బేతంచెర్లకు చెందిన బుగ్గన చంద్ర మౌళీశ్వరరెడ్డిని ప్రత్యేక ఆహ్వానితుల కమిటీ సభ్యుడిగా నియమించారు. ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మహానందిలో ముగిసిన ఉత్సవాలు



మహానందిలో ఉత్సవమూర్తుల ఊరేగింపు

మహానంది, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో దసరా పర్వదినం పురస్కరించుకొని ఆలయంలో ఈవో నల్లకాల్వ శ్రీనివా సరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు పూజలు ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం ఆలయంలోని ప్రత్యేక యాగశాల మంటపంలో రుత్వికులు దాతలతో చండీహోమం, యాగాలను భక్తిశ్రద్ధలతో చేశారు. ఉత్సవాలకు ముగింపుగా పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తుల విగ్రహాలను ప్రత్యేక పల్లకిపై ఆశీనులు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈశ్వర్ నగర్ కాలనీలోని జమ్మిచెట్టు వద్దకు ఉత్సవ మూర్తులను తీసుకొచ్చారు. పూర్ణాహుతితో శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. దసరా ఉత్సవాల్లో భాగంగా ఆనవాయితీ ప్రకారం నంద్యాల బ్రహ్మానందీశ్వరుని ఆలయానికి వెళ్లిన మహానంది ఉత్సవమూర్తుల విగ్రహాలు ఉత్సవాలు ముగియడంతో శుక్రవారం తిరిగి ప్రత్యేక పల్లకిపై నంద్యాల నుంచి మహానందికి చేరుకున్నాయి. స్థానిక గరుడ నందీశ్వరుని ఆలయం వద్ద ఉత్సవమూర్తులకు అధికారులు, వేద పండితులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం మహానంది ఆలయానికి చేర్చారు.



బీజాపూర్ జిల్లాలో లొంగిపోయిన మావోయిస్టులు

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు గిరిజనుల హత్య

» మావోయిస్టుల ఘాతుకం

» బీజాపూర్ జిల్లాలో లొంగిపోయిన 103మంది మావోయిస్టులు

చర్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, సుకుమా జిల్లాల్లో మావోయిస్టులు ఇద్దరు గిరిజనులను హత్య చేశారు. బీజాపూర్ జిల్లా పూజారి కాంకేర్ గ్రామానికి చెందిన మడకం భీమా(45)ను మావోయిస్టులు గురువారం అతని ఇంటి ఆవరణలోనే దారుణంగా కత్తులతో పొడిచి చంపేశారు. భీమా 2018లో తెలంగాణలోకి వెళ్లిపోయి, ములుగు జిల్లాలో ఓ ఎస్ఐతో కలిసి పని చేశాడని, గ్రామంలో పోలీస్ క్యాంప్ పెట్టిన తరువాత తిరిగి వచ్చి, ప్రజలను బెదిరిస్తూ, రూ.లక్షలు దోచుకుంటున్నాడని, భూములు ఆక్రమిస్తున్నాడని అందుకే హత్య చేశామని మావోయిస్టులు ఓ లేఖలో పేర్కొన్నారు. అలాగే సుకుమా జిల్లా కిష్టారం అడవుల్లో ఓ గిరిజనుడిని మావోయిస్టులు హతమార్చారు. ఇదిలా ఉంటే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గంగలూరు అడవుల్లో గురువారం సాయంత్రం ఎన్‌కౌంటర్ జరిగింది. ఒక మావోయిస్టు చనిపోయాడు. మరోవైపు, బీజాపూర్ జిల్లా పోలీసులు ఎదుట గురువారం 103 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు లొంగిపోయారు. వీరిలో 22 మంది మహిళలున్నారు. లొంగి పోయిన వారిలో 47మందిపై మొత్తం కలిపి రూ.1.06కోట్ల రివార్డులున్నట్టు ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 421మంది మావోయిస్టులు అరెస్టయ్యారని, 410 మంది లొంగి పోయారని, 137 మంది ఎన్‌కౌంటర్లలో మృతి చెందారని వెల్లడించారు.

అసభ్య పోస్టుల కేసులో అంజద్ బాషా పీఏ అరెస్టు

» కడప కోర్టులో హాజరు.. బెయిల్ మంజూరు

కడప క్రైం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కడప ఎమ్మెల్యే ఆర్.మాధవిపై అసభ్య పదజాలంతో ఉన్న వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసిన కేసులో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పీఏ షేక్ మహ్మద్‌ఖాజాను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం అతన్ని కడప ఎక్సైజ్ కోర్టులో హాజరు పరచగా.. సొంత పూచీకత్తుపై అతనికి కోర్టు బెయిలు మంజూరు చేసింది. ఆ వివరాలను కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, వన్‌టౌన్ సీఐ రామకృష్ణ విలేకరులకు వివరించారు. కడప అక్బర్ వీధికి చెందిన షేక్ మహ్మద్ ఖాజా మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు పీఏగా పనిచేస్తున్నాడు. 2024 ఎన్నికల సమయంలో ప్రస్తుత కడప ఎమ్మెల్యే మాధవి, ఆమె భర్త శ్రీనివాసరెడ్డిపై కడప అలంఖాన్‌పల్లెకు చెందిన విజయలక్ష్మి అసభ్యకరంగా మాట్లాడారు. ఆ వీడియోను అంజద్‌బాషా అతని సోదరుడు అహ్మద్‌బాషా ప్రోద్బలంతో సోషల్ మీడియాలో షేక్ మహ్మద్‌ఖాజా పోస్టు చేశాడు. ఈ వీడియో వైరల్ కావడంతో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు అంజద్‌బాషా, అహ్మద్‌బాషా, షేక్ మహ్మద్‌ఖాజాలపై కేసు నమోదు చేశారు. షేక్ మహ్మద్ ఖాజాను బుధవారం హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. గురువారం కోర్టులో హాజరు పరిచారు. ఎవరైనా సోషల్ మీడియాలో అసభ్యకరమైన వీడియోలు పోస్టు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

'సిట్' ముందు హాజరైన మిథున్‌రెడ్డి

విజయవాడ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో నిందితుడిగా ఉన్న రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి విజయవాడలోని సిట్ అధికారుల ముందు శుక్రవారం హాజరయ్యారు. ప్రతి సోమవారం, శుక్రవారం సిట్ అధికారుల ముందు హాజరవ్వాలని కోర్టు బెయిల్ ఉత్తర్వుల్లో షరతు విధించింది. దాని ప్రకారం మిథున్‌రెడ్డి సిట్ కార్యాలయానికి వచ్చి పుస్తకాల్లో సంతకం చేశారు. ఇటీవలే ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి విడుదలైన విషయం తెలిసిందే.



సర్జరీ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యుడు చక్రవర్తి, పక్కన సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ తదితరులు

'సత్యసాయి' ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీ సేవలు

» గుండె, యూరాలజీ విభాగంలో అందుబాటులోకి సేవలు

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అత్యాధునిక రోబోటిక్ సర్జరీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. రూ.8 కోట్ల విలువైన అత్యాధునిక రోబోటిక్ సర్జరీ వ్యవస్థను సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, సభ్యుడు చక్రవర్తి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ, భగవాన్ సత్యసాయి ధ్యేయమైన విలువలు, కరుణ, ప్రేమతో కూడిన అత్యాధునిక వైద్యాన్ని ఉచితంగా అందుబాటులోకి తెచ్చామన్నారు. ఎస్ఎస్ ఇన్నొవేషన్స్ అనే భారతీయ సంస్థ ప్రపంచ స్థాయి ప్రమాణాలకు తగ్గట్లు ఈ రోబోటిక్ శస్త్ర చికిత్స వ్యవస్థను అభివృద్ధి చేసిందన్నారు. ఈ వ్యవస్థతో శరీరంలోని సున్నితమైన ప్రాంతాలకు కూడా అత్యంత కచ్చితత్వంతో, సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలను సులభతరంగా చేయవచ్చని వెల్లడించారు. రోబోటిక్ సర్జరీకి రూ.లక్షలు ఖర్చు అవుతుందని, కానీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పూర్తి ఉచితంగా అందుతుందని స్పష్టం చేశారు.



రోబోటిక్ సర్జరీ యంత్రాలు

ములకలచెరువు కేంద్రంగా నకిలీ మద్యం తయారీ

» రూ.1.75 కోట్ల విలువైన నకిలీ మద్యం స్వాధీనం

» స్పిరిట్, బాటిళ్లు, పరికరాలు సీజ్.. 9 మంది అరెస్టు



నకిలీ మద్యాన్ని తయారు చేస్తున్న దృశ్యం.. స్వాధీనం చేసుకున్న నకిలీ మద్యం బాక్సులు

రాయచోటి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ములకలచెరువులో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపి రూ.1.75కోట్ల విలువైన నకిలీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కడప ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి అధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. అనంతరం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, ఆయన అనుచరుడు రాజు ములకలచెరువుకు సమీపంలోని కనుగొండ ఆర్చి సమీపంలో ఉన్న పాత డాబాను అద్దెకు తీసుకుని నకిలీ మద్యం తయారు చేస్తున్నారు. ఈ మద్యాన్ని వాహనం ద్వారా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ ధర కంటే తక్కువకే ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పలు ప్రభుత్వ మద్యం షాపులకు కూడా ఈ మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఇటీవల జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పెద్దతిప్ప సముద్రం మండలంలో తనిఖీలు నిర్వహిస్తూ.. నకిలీ మద్యం తీసుకెళ్తున్న వాహనాన్ని నిలిపారు. బాటిళ్ల మీద ఉన్న లేబుల్‌ను స్కాన్ చేశారు. అయితే స్కాన్ కాకపోవడంతో అనుమానం వచ్చి విషయాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్ దేవ్‌కు ఫిర్యాదులు అందడంతో అధికారులు గత నాలుగు రోజులుగా నిఘా ఉంచి శుక్రవారం ఈ దాడులు చేశారు. 15 వేల నకిలీ మద్యం బాటిళ్లు, 1050 లీటర్ల స్పిరిట్ క్యాన్లు, 1500 లీటర్ల బ్లెండ్(తయారైన నకిలీ మద్యం), 10 వేల ఖాళీ మద్యం బాటిళ్లు, 4 వేల మద్యం సీసా మూతలు.. స్టిక్కర్లు, మద్యం బాటిళ్లు తయారు చేసే పరికరాలు, ఇతర సామగ్రి, నకిలీ మద్యం సరఫరా చేసే వాహనాన్ని సీజ్ చేశారు. తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరికి చెందిన మరిమారన్, తిరుపత్తూరుకు చెందిన సురేశ్, సూర్య, అనందన్, ఒడిశా రాష్ట్రం బ్రహ్మపూర్‌కు చెందిన ఆనంద్ దాస్, మిథున్, విశాఖపట్నానికి చెందిన స య్యద్ అలీ, వాహన డ్రైవర్ బాలరాజు, నకిలీ మద్యం కలిగి ఉన్న బెల్ట్ షాపు నిర్వాహకుడు రంగసముద్రానికి చెందిన నాగరాజు, పెద్దతిప్ప సముద్రంలోని మద్యం దుకాణ నిర్వాహకుడు టీడీపీ నేత కట్టా సురేంద్రనాయుడును అరెస్టు చేశారు. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, అతని అనుచరుడు రాజు, ములకలచెరువులోని రాక్‌స్టార్ ప్రభు త్వ మద్యం దుకాణ నిర్వాహకుడు రాజేశ్ తదితరులపైనా కేసు నమోదు చేశారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

నిందితుల్లో తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి పీఏ

రాజేశ్ తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పీఏగా పనిచేస్తున్నారు. ఇతని పేరుతో ఉన్న వాహనం ద్వారానే నకిలీ మద్యం సరఫరా చేస్తున్నారు. దీనిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఈ నకిలీ మద్యం తయారీ వెనుక తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకుల సమీప బంధువుల ప్రమేయం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నకిలీ మద్యం తయారీలో జిల్లాలోని పలువురు టీడీపీ నాయకుల హస్తం ఉన్నట్టు కూడా ఆరోపణలు వినిస్తున్నాయి. నియోజకవర్గంలోని పలు బెల్ట్‌షాపులు, ప్రభుత్వ మద్యం దుకాణాల్లోనూ ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు.

గ్యాంగ్ రేప్ కేసు నిందితులకు రిమాండ్

» గత నెల 25న చిత్తూరు సమీపంలో బాలికపై అఘాయిత్యం

చిత్తూరు అర్బన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల చిత్తూరులో ఇంటర్ విద్యార్థినిపై గ్యాంగ్ రేప్‌కు పాల్పడిన ముగ్గురు యువకులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ సాయినాథ్ మీడియాకు వివరించారు. గత నెల 25వ తేదీన చిత్తూరు నగర సమీపంలో ఉన్న నీవా నగర వనం పార్కుకు వచ్చిన యువ జంటను ముగ్గురు యువకులు బెదిరించారు. బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ జంటలోని యువకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 29వ తేదీన పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితులైన మహేష్, కిశోర్, హేమంత్‌ను శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ముగ్గురు నిందితులకు పోక్సో కోర్టు ఈ నెల 16 వరకు రిమాండ్ విధించింది. నిందితుల్లో ఒకరైన మహేష్ ఓ బాలికను ఈవ్ టీజింగ్ చేసిన కేసులో నిందితుడిగా ఉన్నాడు. కిశోర్ 2022లో నగరంలోని ఓ వైన్ షాపులో పనిచేస్తుండగా అక్కడి మద్యాన్ని బ్లాక్‌లో విక్రయించాడని అతనిపై కేసు నమోదైంది. కాలక్షేపం కోసం పార్కులకు వచ్చే ప్రేమ జంటలను లక్ష్యంగా చేసుకుని వారు కలిసున్న దృశ్యాలను వీడియో తీసి వారిని బెదిరించడం.. వారి వద్ద ఉన్న నగదు, బంగారాన్ని లాక్కోవడం.. లైంగిక వేధింపులకు పాల్పడటం.. వీరి నేర ప్రవృత్తిగా పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. కాగా.. నిందితుల్ని స్థానిక డీపీవో కార్యాలయం నుంచి అర కిలో మీటరు దూరంలో ఉన్న కోర్టు వరకు బేడీలు వేసి రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకెళ్లారు.

హోటల్ సిబ్బందిపై వైసీపీ నేత నాగార్జున యాదవ్ దాడి

» అల్పాహారం ఆలస్యంగా ఇచ్చారని దౌర్జన్యం

» ఇరువురికి గాయాలు.. కేసు నమోదు



హోటల్ యజమాని కొడుకు ప్రేమ్‌కుమార్

సత్తెనపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అల్పాహారం తీసుకురావడంలో ఆలస్యం అయిందని హోటల్ యజమాని, సిబ్బందిపై వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ అతని అనుచరులు రెచ్చిపోయారు. వారిపై దాడి చేసి గాయపర్చారు. ఈ దాడి ఘటన గురువారం రాత్రి పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని తాలూకాసెంటర్‌లో జరిగింది. రాత్రి 10 గంటల సమయంలో నాగార్జున యాదవ్ అతని అనుచరులు పట్టణంలోని గుడ్‌మార్నింగ్ హోటల్‌కు టిఫిన్ చేసేందుకు వచ్చారు. టిఫిన్ అందించడం ఆలస్యమవుతుందని నాగార్జునయాదవ్ అతని అనుచరులు గొడవకు దిగారు. హోటల్ యజమాని శేఖర్, అతని కుమారుడు ప్రేమ్‌కుమార్, వర్కర్ నాగేశ్వరరావుపై దాడి చేశారు. ఈ ఘటనలో ప్రేమ్‌కుమార్, వర్కర్‌కు గాయాలయ్యాయి. తనతో పెట్టుకుంటే అబ్బూరు ఊరు ఊరంతా కదిలొస్తుందంటూ హోటల్ యజమాని శేఖర్‌ను నాగార్జున యాదవ్ బెదిరించారు. దాడి ఘటనపై హోటల్ యజమాని శేఖర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



హోటల్ యజమానిపై దౌర్జన్యం చేస్తున్న వైసీపీ నాయకుడు యనమల నాగార్జునయాదవ్

తామ్ర శాసనాలను ప్రదర్శిస్తాం

ఏఎస్ఐ డైరెక్టర్ మునిరత్నంరెడ్డి



ప్రదర్శనకు తామ్రశాసనాలు (ఫైల్)



బంగారు, వెండి బిల్లలు (ఫైల్)

శ్రీశైలం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఈ నెల 16న ప్రధాని మోదీ శ్రీశైలం రానున్న నేపథ్యంలో 2021వ సంవత్సరంలో ఘంటామఠంలో లభ్యమైన 21 సెట్లు తామ్ర శాసనాలను ప్రధాని తిలకించేందుకు ప్రదర్శనకు ఉంచుతామని ఏఎస్ఐ (ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా) మైసూర్ డైరెక్టర్ మునిరత్నంరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడారు. 17వ శతాబ్ది మధ్య పాలించిన రెడ్డి రాజులు, రెచెర్ల సామంతులు, విజయనగర రాజులు, ఒరిస్సాను పాలించిన గజపతులు, శ్రీశైలం రాజులు మల్లన్నకు సమర్పించిన బంగారు వివరాలను తామ్ర శాసనాల్లో పొందుపరిచినట్లు వివరించారు.

వీటి ద్వారా వచ్చే ఆదాయంతో శ్రీశైలానికి వచ్చే భక్తుల కోసం సత్రాలు, భోజన వసతులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ తామ్ర పత్రాల ద్వారా ఆనాటి రాజకీయ, ఆర్థిక, సాంఘిక, మతపరమైన అనేక విషయాలు తెలుస్తాయన్నారు. ప్రత్యేకించి రెచెర్ల రాజైన లింగమనాయకా 1421వ సంవత్సరంలో వేయించిన తామ్రశాసనం ద్వారా అనేక అగ్రహారాలన్నింటిని ముస్లింలు అక్రమించుకొని స్వామివారి సేవలకు భంగం కలిగించిన సందర్భంలో లింగమనాయకా వాటన్నింటిని తిరిగి దేవాలయానికి సమర్పిస్తూ స్వరా జ్యంను పునరుద్ధరణ చేస్తారన్నారు. ఘంటామఠంలో బంగారం 699 గ్రాముల 630 మిల్లీగ్రాములు, వెండి 2 కేజీల 504 గ్రాములు లభ్యమైందని తెలిపారు.

చందన అలంకారంలో సుంకులాపరమేశ్వరి దేవి



గూడూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో గూడూరు మండలం కె.నాగలాపురంలో సుంకులాపరమేశ్వరి అమ్మవారు గురువారం చందన అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దసరా రోజున అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను ఈఓ రాధాకృష్ణ, గోపాల్ రెడ్డి, సురేష్, సిబ్బంది కేశవ తదితరులు పర్యవేక్షించారు.

మహానందిలో తమిళనాడు హైకోర్టు న్యాయమూర్తి

మహానంది, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో గురువారం మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీటీ ఆశ కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ ముఖ మండపం వద్ద ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి దంపతులు ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు అభిషేకార్చనలు చేశారు. ఆలయ యాగశాల మంటపంలో వేద పండితులు వీరిని ఆశీర్వదించారు. ఈవో స్వామి వారి శాలువాతో సన్మానించి, ప్రసాదాలు అందజేశారు. వీరివెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు పాల్గొన్నారు.

రక్తపుగట్టు



ఆలూరు/హొళగుంద/ఆలూరు రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గం హొళగుంద మండలం దేవరగట్టులో బన్ని ఉత్సవం ప్రతి ఏటా దసరా పండుగ రోజున నిర్వహిస్తారు. ఈ ఉత్సవంలో భాగంగా మాళమల్లేశ్వరస్వామి ఉత్సవమూర్తులను తమ గ్రామానికి తీసుకెళ్లేందుకు మూడు గ్రామాల ప్రజలు మరోవైపు కర్రలతో కొట్టుకోవడం ఇక్కడి ఆనవాయితీ. అందులో భాగంగానే గురువారం దసరా రోజున ఉదయం నుంచి రాత్రి వరకు మాళమల్లేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. గురువారం అర్ధరాత్రి డిర్ర్‌ర్ర్.. గో పరాక్ అంటూ భక్తులు నినాదాలు చేస్తూ ఇనుప రింగులు తొడిగిన కర్రలు, అగ్ని కాగడాలతో బన్ని (కర్రల సమరం) ఉత్సవంలో పాల్గొన్నారు. అర్ధరాత్రి ఒళ్లు గగుర్పాటు కలిగించేలా సాగిన ఈ సమరంలో నెరణికి, నెరణికితండా, కొత్తపేట, ఎల్లార్తి, అరికెర, అరికెరతండా, బిలేహాల్ గ్రామాలకు చెందిన భక్తులు 800 అడుగుల ఎత్తులో ఉన్న మాళమల్లేశ్వరుడి దర్శనం చేసుకున్నారు. అనంతరం కల్యాణోత్సవం తంతు పూర్తయ్యాక ఉత్సవమూర్తులను 350 మెట్లు దిగి కల్యాణకట్ట దగ్గరకు చేర్చారు. ఆ ప్రాంతంలో ఉత్సవమూర్తులను తమ గ్రామానికి తీసుకెళ్లేందుకు భక్తులు పోటీపడ్డారు. ఈ క్రమంలో నెరణికి గ్రామ ప్రజలను అరికెర గ్రామ ప్రజలు అడ్డుకుని పల్లకి, ఉత్సవమూర్తులను లాక్కెళ్లే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో నెరణికి, నెరణికితండా, కొత్తపేట గ్రామస్థులు ఒక్కసారిగా కోపోద్రిక్తులై కర్రలతో దాడి చేశారు. హోరాహోరీగా సాగిన ఈ బన్ని ఉత్సవంలో ఒకరిపైకరు రాళ్లు విసురుకున్నారు. అగ్ని కాగడాలు విసురుకున్నారు. ఈ ఘటనల్లో అరికెర గ్రామానికి చెందిన కోసిగి తిమ్మప్ప(50) తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య బసమ్మ, ఇద్దరు పిల్లలు సంతానం. ఉత్సవాలను చూసేందుకు వచ్చిన ఆదోని పట్టణంలోని అరుణజ్యోతినగర్‌కు చెందిన ఆంజనేయులు(47) గుండెపోటుకు గురై మృతిచెందాడు. ఈయనకు భార్య, నలుగురు పిల్లలు సంతానం. ఈ ఉత్సవంలో 90 మంది గాయాలపాలయ్యారు. కొందరికి తలలు పగిలి రక్తం చిందింది. వీరిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. మరికొందరికి కాలిన గాయాలయ్యాయి. ఇందులో 11 మందికి తీవ్ర గాయాల పాలయ్యారు. వీరిని మెరుగైన చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దేవరగట్టులో భవిష్యవాణి



దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి బన్ని జైత్రయాత్రలో కీలక ఘట్టం భవిష్యవాణి (కార్ణికం). బన్నీ జైత్రయాత్ర ఊరేగింపు అనంతరం ఆదివారం ఉదయం 6:15 నిమిషాలకు ఎదురు బసవన్న గుడి వద్ద పూజారి గిరి మల్లయ్య స్వామి భవిష్య వాణి వినిపించారు. దేవరగట్టులో చెప్పే భవిష్యవాణిపై రైతులకు ఎంతో నమ్మకం. పూజారి గోపర్రాక్.. అనడంతో ఒక్కసారిగా భక్తులు నిశ్శబ్దాన్ని పాటించారు. కన్నడ భాషలో మాట్లాడుతూ...

- ఆరు అరడాదితూ హెచ్చరా (దేశరాజకీయాల్లో సంక్షోభం, యుద్ధ వాతావరణం నెలకొనవచ్చు. జాగ్రత్త వహించాలి)
- శక్తి ధ్యాన మాడబెకు (శక్తి స్వరూపిణి అమ్మవారిని ధ్యానించాలి)
- గంగి హోలేదండిగే నింతాలే, నీతూ ఉత్తర దిక్కలి సంహార మడిద్దాలే (గంగమ్మ నది ఒడ్డున నిలిచి, దేశ ఉత్తర దిక్కున సంహారం చేస్తుంది. ఉత్తర దిక్కున వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి)
- క్వింటాళ్ల 6,200/- నగె హత్తె (పత్తి)
- క్వింటాళ్ల 3,400/- జ్వాళే (తెల్ల జొన్న)
- 3-6.. 6-3.. మూడు ఆరు అవుతుంది. ఆరు మూడవుతుంది. వాణిజ్య పంటల ధరలు పెరిగి, తగ్గు ముఖం పట్టవచ్చు. రైతులు సుఖ సంతోషాలతో ఉంటారు. బహుపరాక్ అంటూ భవిష్య వాణి (కార్ణికం) ముగించారు.

కాళరాత్రి.. కాగడాల వెలుతురులో..

కర్నూలు జిల్లా హొళగుంద మండలం దేవరగట్టులో దసరా పర్వదినాన బన్ని జైత్రయాత్ర ఉత్సవాలు ఏటేటా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. దుష్టశక్తులపై దైవశక్తులు సాధించిన విజయానికి గుర్తుగా విజయోత్సవ యాత్ర సాగిస్తారు. అందులో భాగంగానే గురువారం రాత్రి నుంచి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో ఉత్సవమూర్తులు మాళ మల్లేశ్వరస్వాముల పల్లకిని వశం చేసుకోవడం కోసం సాగే బన్ని ఉత్సవం కర్రల సమరాన్ని తలపిస్తుంది. స్వామివారి రక్షణార్థులైన నెరణికి, నెరణికితండ, కొత్తపేట గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు కాగడాలు, కర్రలు చేతపట్టుకొని దైవకార్యం విజయవంతంగా నిర్వహించాలని డొళ్లబండ వద్దకు చేరుకున్నారు. గ్రామ పెద్దల సమక్షంలో వైషమ్యాలు, విబేధాలు లేకుండా సమష్టిగా దేవుని కార్యం నిర్వహిస్తామని పాలబాసలు చేశారు. డిర్ర్‌ర్ర్..గోపరాక్ (బహుపరాక్) అంటూ యుద్ధానికి సిద్ధమైన సైనికుల్లా పట్టుడు కర్రలు, కాగడాలు చేతపట్టుకొని దేవరగట్టు కొండపైకి చేరుకున్నారు. ప్రధాన అర్చకులు గిరి మల్లయ్యస్వామి ఆధ్వర్యంలో మాళ మల్లేశ్వరుల కల్యాణోత్సవం నిర్వహించారు. అప్పుడు సమయం అర్ధరాత్రి 1:15 గంటలు అయింది. ఉత్సవ మూర్తుల పల్లకితో కొండదిగి సింహాసన కట్టకు చేరుకున్నారు. అప్పటికే స్వామికోసం అక్కడ కర్రలతో సిద్ధంగా ఉన్న ఎల్లార్తి, అరికెర, అరికెరతండా, సులవాయి, ఆలూరు గ్రామాలకు చెందిన భక్తులు నెరణికి, నెరణి కితండా, కొత్తపేట గ్రామస్థులను అడ్డుకున్నారు. క్షణాల్లో వేలాది కర్రలు తలలపై నాట్యమాడాయి. ఓ వర్గం ముందుకు సాగితే, మరోవర్గం వెనుకడుగు వేసింది. కర్రల యుద్ధం తలపించేలా బన్ని ఉత్సవం సాగింది. చివరికి నెరణికి గ్రామస్థులు పైచేయి సాధించి ఉత్సవమూర్తులను వారి గ్రామానికి తీసుకెళ్లారు.

రక్తపడి వద్ద పిడికెడు రక్తం

తెల్లవారుజామున దేవరగట్టులోని రక్తపడి వద్దకు గొరవయ్య చేరుకున్నారు. ఈ సందర్భంగా పొడవైన దబ్బనం గుచ్చి పొడవైన దారాన్ని లాగారు. ఈ క్రమంలో వచ్చిన పిడికెడు రక్తాన్ని రక్తపడికి సమర్పించారు. అనంతరం ఉత్సవమూర్తులను శుక్రవారం ఉదయం 7 గంటలకు తిరిగి జైత్రయాత్రగా వచ్చి సింహాసనం కట్ట వద్దకు చేరుకోవడంతో బన్ని ఉత్సవం ముగిసింది.

ఉత్సవాలను తిలకించిన ఎస్పీ

బన్ని ఉత్సవాలను ఎస్పీ విక్రాంత్‌రెడ్డి, ఏఎస్పీ హుసేన్‌పీరా, ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్, పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి ఉత్సవాలను తిలకించారు. మీడియాతో ఎస్పీ మాట్లాడారు. సంప్రదాయంతో కూడుకున్న ఈ ఉత్సవాల్లో 90 మంది గాయాలపాలయ్యారన్నారు. ఒకరు మృతిచెందగా, మరో వ్యక్తి గుండెపోటుతో మృతిచెందినట్లు తెలిపారు. వెయ్యి మంది పోలీసు బలగాలను నియమించామన్నారు. పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య, సీఐ రవిశంకర్‌రెడ్డి, ఎస్ఐలు, అధికారులు పాల్గొన్నారు.

దేవరగట్టుకు ఇటలీ దేశస్థులు

ఉత్సవాలను వీక్షించిన విదేశీయులు



ఉత్సవాలను తిలకిస్తున్న ఇటలీ దేశస్థులు

ఆలూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దేవరగట్టు బన్ని ఉత్సవాలను తిలకించేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ ఏడాది ఉత్సవాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో బన్ని ఉత్సవాన్ని తిలకించేందుకు విదేశీయులు తరలి వచ్చారు. ఇటలీకి చెందిన ఓ బృందం దేవరగట్టుకు తరలివచ్చింది. ఇక్కడి కర్రల సమరాన్ని వారు ఆసక్తిగా తిలకించారు. ప్రతి సన్నివేశాలను కెమెరాలో బంధించారు. భక్తులతో కలిసి ఫొటోలు తీసుకున్నారు. ఇక్కడ కొనసాగుతున్న ఆచారం.. సంప్రదాయాలను తమ దేశంలో డాక్యుమెం టరీగా రూపొందిస్తామని ఇటాలియన్లు తెలిపారు. భారతదేశంలో అనాదిగా వస్తున్న ఇలాంటి ఆచారాలు దేశ ఐక్యతను చాటుతాయని వారు అన్నారు. అయితే భక్తి పేరుతో ఇలా తలలు పగులకొట్టుకోవడం ఒళ్లు గగుర్పాటుకు గురి చేస్తుందని వారి భాషలో తెలిపారు. స్థానిక ప్రజలు సాదరంగా ఆహ్వానించి తమను అక్కున చేర్చుకోవడంపై ఇటలీ దేశస్థులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. పోలీసులు సైతం విదేశీయులకు రక్షణ కల్పించారు.

వైభవం.. మాళమల్లేశ్వరుడి కల్యాణం

- కర్రలతో కదనం రంగంలోకి..
- దేవరగట్టుకు పోటెత్తిన భక్తులు

ఆలూరు/ హొళగుంద, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : దేవరగట్టు మాళమల్లేశ్వరుడి కల్యాణం వైభవంగా నిర్వహించారు. గురువారం అర్ధరాత్రి 12.30 గంటల డిర్ర్‌ర్ర్ గోపరాక్ (బహుపరాక్) అంటూ వేలాదిగా భక్తజనం దేవరగట్టుపైకి చేరుకుంది. నేరణికి, నేరణికి తండా, కొత్తపేట గ్రామాలకు చెందిన భక్తులు తలకు పాగాచుట్టి చేతిలో కర్రపట్టి యుద్ధానికి సిద్ధమైన సైనికుల్లా దేవుడి కార్యంలో నిమగ్నమయ్యారు. శుభముహూర్తం అర్ధరాత్రి 12.45 నుంచి 1.15 నిమిషాలకు వేదపండితులు రవిశర్మ మాళ మల్లేశ్వరస్వాముల కల్యాణోత్సవం నిర్వహించారు. జైత్రయాత్రకు సై అంటూ ఉత్సవ మూర్తులతో కొండ దిగి సింహాసన కట్ట వద్దకు చేరుకోగా దేవుడ్ని దక్కించుకోవడానికి అప్పటికే అక్కడికి చేరుకున్న పలు గ్రామాల భక్తులు కర్రలతో మేము సైతం అంటూ కదనరంగంలోకి దిగడంతో బన్ని ఉత్సవం మొదలైంది. 800అడుగుల పైభాగాల ఉన్న దేవరగట్టుపై దాదాపు అరగంట పాటు బన్ని ఉత్సవం జరిగింది. ఆలూరు నియోజకవర్గం హొళగుంద మండలం దేవరగట్టు వేదికగా గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు జరిగిన ఉత్సవాన్ని కళ్లారా వీక్షించాలని రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు.

నెల్లూరులో వైద్య విద్యార్థిని ఆత్మహత్య


గీతాంజలి (ఫైల్)

నంద్యాల/నెల్లూరు వైద్యం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏమైందో ఏమోగానీ నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో ఓ వైద్యార్థిని శుక్రవారం బలవన్మరణానికి పాల్పడింది. పోలీసుల కథనం మేరకు.. బండిఆత్మకూరు మండలం సంత జూటూరుకు చెందిన కెనంజీవరాయుడు, లక్ష్మీదేవి కుమార్తె బన్నెల గీతాంజలి నెల్లూరులోని ప్రభుత్వ వైద్యకళాశాలలో మెదటి సంవత్సరం మెడిసిన్ చదువుతూ కళాశాల హాస్టల్లో ఉంటోంది. థియరీ పరీక్షలు పూర్తవగా, దసరా సెలవులు సందర్భంగా తన స్నేహితురాలితో కలిసి తిరుతిలోని వారి ఇంటికి వెళ్లారు. 30వ తేదీన స్వగ్రామం సంతజూటూరుకు గీతాంజలి వెళ్లింది. శుక్రవారం ప్రాక్టికల్స్ పరీక్షలు ఉండటంతో గురువారం తిరిగి నెల్లూరుకు చేరుకుంది. శుక్రవారం ఉదయం సహచర విద్యార్థిని హిమనందిని త్వరగా ప్రాక్టికల్స్ ఎగ్జామ్‌కు వెళ్లింది. ఏం జరిగిందో ఏమో తెలియదుకానీ గీతాంజలి తన గదికి తలుపుగడియ వేసుకుని బెడ్‌పై కుర్చీ వేసుకుని చున్నీతో ఫ్యానుకు ఉరివేసుకుంది. గీతాంజలి పరీక్షకు వెళ్లకపోవడంతో వసతి గృహ అధ్యాపక సిబ్బంది ఆమె గది వద్దకు వెళ్లి తలుపులు తెరిచే ప్రయత్నం చేయగా లోపల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో వారు తలుపులు బలంగా నెట్టడంతో తెరుచుకున్నాయి. అప్పటికే గీతాంజలి ఉరికి వేలాడుతూ ఉంది. దీంతో వారు దర్గామిట్ట పోలీసులకు సమాచారం అందించారు. సీఐ ఎం రోశయ్య చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి బాధిత కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు నెల్లూరుకు చేరుకుని విగతజీవిగా పడి ఉన్న గీతాంజలిని చూసి కన్నీరుమున్నీర య్యారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆదోనిలో ఇంటర్ విద్యార్థిని..


ఎ లక్ష్మి (ఫైల్)

ఆదోని, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బావాజీపేటకు చెందిన బోయ లక్ష్మి(19) ఆత్మహత్య చేసుకుంది. వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ తెలిపిన వివరాలివీ.. పెద్దాంజని, సరోజ దంపతుల పెద్ద కుమార్తె లక్ష్మి ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. శుక్రవారం ఉదయం పూజ చేసిన లక్ష్మి ఆ తర్వాత తన గదిలోకి వెళ్లి తలుపు వేసుకుంది. చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. ఎంతసేపటికీ తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు తలుపు పగలగొట్టి చూడగా లక్ష్మి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. లక్ష్మి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం..

ఆదోని, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆదోని పట్టణం బావాజీపేటకు చెందిన సతీశ్ అనే యువకుడు శుక్రవారం రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటనలో సతీశ్ తీవ్రంగా గాయపడ్డాడు. టూటౌన్ సీఐ శ్రీరామ్ తన సిబ్బందితో హుటాహుటిన రాయ మిల్లు సమీపంలో ఉన్న పట్టాలపై తీవ్ర గాయాలతో ఉన్న సతీశ్‌ను ఆసుపత్రికి తరలించారు. అయితే అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం వెంటనే కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే యువకుడి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

లారీ, బైకు ఢీ.. ఒకరి మృతి

ఆస్పరి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నగరూరు బస్సు స్టాప్ సమీపంలో ఆదోని ఆర్‌అండ్‌బీ రోడ్డులో లారీ, బైకు ఢీకొన్న ప్రమాదంలో శశిధర్‌రెడ్డి(35) అనే వ్యక్తి గురువారం రాత్రి అక్కడికక్కడే మృతిచెందాడు. తాడిపత్రి పట్టణానికి చెందిన శశిధర్‌రెడ్డి ఉద్యోగరీత్యా ఆదోనిలో నివాసముంటున్నాడు. తాడిపత్రి నుంచి దసరా పండగ ముగించుకుని తన బామ్మర్ది విష్ణువర్ధన్‌రెడ్డిని తన బైకుపై ఎక్కించుకుని ఆదోనికి వస్తుండగా గుంతను తప్పించబోయి ప్రమాదం జరిగినట్లు సీఐ గంగాధర్ తెలిపారు. బైకు నడుపుతున్న శశిధర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా, వెనుక కూర్చున్న విష్ణువర్ధన్‌రెడ్డికి గాయాలైనట్లు సీఐ తెలిపారు. శశిధర్‌రెడ్డికి భార్య గౌతమి, ఒక కుమారుడు ఉన్నారు. గౌతమి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సిలిండర్ పేలి ఇళ్లు దగ్ధం

- రూ.10లక్షలు ఆస్తి నష్టం


దగ్ధమైన ఇల్లు

అవుకు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్లు పేలి ఇళ్లు దగ్ధమైన ఘటన శివవరంలో గురువారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో సుమారు రూ.10లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. వివరాలు.. మండలంలోని శివవరం గ్రామంలో దుబ్బా చిన్న గోవిందరెడ్డి, పుల్లారెడ్డి గురువారం పొలం పనులకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఆమంటలు గ్యాస్ సిలిండర్ వైరుకు వ్యాపించాయి. సిలిండర్లు ఒకదానికి ఒకటి అంటుకొని పేలిపోయాయి. ఈ ఘటనలో దాదాపు ఐదు తులాల బంగారు, రూ.2లక్షల నగదు, ఇంట్లో అగ్నికి ఆహుతైనట్లు బాధితులు తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

ఆదోనిలో మరో ఇద్దరికి తీవ్రగాయాలు..


కుప్పకూలిన పెంకుటిల్లు

ఆదోని రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్ లీకై పేలింది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు తాలుకా ఎస్.ఐ రామాంజనేయులు తెలిపారు. వివరాలు.. ఆదోని మండలం పెద్దపెండేకల్లుకి చెందిన వృద్ధులు అంజనేయ, ఈరమ్మకు ముగ్గురు కొడుకులు ఉన్నారు. వృద్ధులు, కుమారులు వేర్వేరుగా నాలుగు పెంకుటి గృహాల్లో నివాసం ఉంటున్నారు. శుక్రవారం వీరంతా పొలానికి వెళ్లారు. పెద్దకుమారుడు ఈరన్న, కోడలు శారద పొలంలోనే ఉండిపోయారు. ఈరమ్మ వెంట వీరి కుమారుడు శ్రీకాంత్ ఇంటికొచ్చాడు. లోపలికెళ్లి లైట్‌ను వేయగానే ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ పేలింది. ఇల్లు మొత్తం కూలిపోయింది. ఈరమ్మ, శ్రీకాంత్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో డ్రైవర్లకు చేయూత

- కర్నూలు జిల్లాలో 13,495 మంది లబ్ధిదారులు

కర్నూలు క్రైం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు చేయూత అందించేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. శనివారం ఒక్కొక్కరి ఖాతాలో రూ.15వేలు జమ చేసేందుకు సిద్ధమైంది. కర్నూలు జిల్లాలో 13,495 మంది ఆటో డ్రైవర్లు ఈ పథకం కింద లబ్ధి పొందనున్నారు. రూ.20.24 కోట్లు విడుదల చేశారు. అత్యధికంగా కర్నూలు మండలంలో 5,169 మంది లబ్ధిపొందనుండగా.. హోళగుందలో 31 మంది ఈ పథకం కింద లబ్ధి పొందనున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఈ పథకంతో ఆటోడ్రైవర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తాగు, సాగు నీటికి ఇబ్బందులుండవు

- భూగర్భజలాలు పెరుగుతాయి
- గైర్హాజరైన అధికారులకు నోటీసులివ్వండి
- జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి
- ముగిసిన జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయం నుంచి నాగార్జున సాగర్ ద్వారా సముద్రంలో కలిసే నీటిలో కొంత బాగాన్ని పోతిరెడ్డిపాడు ద్వారా కాలువలకు మళ్లిస్తే జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సాగు, తాగునీటికి ఇబ్బందులు ఉండవని జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. శుక్రవారం జడ్పీ మినీ సమావేశ భవనంలో ఏడు స్థాయీ సంఘ సమావేశాలు జరిగాయి. చైర్మన్ అధ్యక్షత వహించగా డిప్యూటీ సీఈవో వెంకటసుబ్బారెడ్డి పర్యవేక్షించారు.

చైర్మన్ మాట్లాడుతూ పోతిరెడ్డిపాడు నుంచి వరద నీటిని విడుదల చేస్తే జిల్లాలోని వెలుగోడు, గోరుకల్లు, అవుకు, రిజార్వయర్లను నింపుకోవడంతో పాటు కాలువల్లో నిరంతర ప్రవాహం ఉంటే భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. ఈదిశగా నీటి పారుదల శాఖకు చెందిన ఇంజనీర్లు చర్యలు చేపట్టాలన్నారు. ఈ ఏడాది జూన్ 22నాటికి శ్రీశైలంలో 854 అడుగుల కంటే ఎక్కువ నీరు ఉండిందని, పోతిరెడ్డి పాడు ద్వారా నీటి ని విడుదల చేసి ఉంటే కనీసం బోర్లు రీచార్జ్ అయ్యేవన్నారు. శ్రీశైలం నీటి విడుదల మన చేతిలో లేదని, దీనికి తెలంగాణ ప్రభుత్వం, కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అనుమతులు కావాలని సంబంధిత పర్యవేక్షక ఇంజనీరు ప్రతాప్ వివరించారు. జడ్పీటీసీలు, సుంకన్న, రంగనాథగౌడు, సుంకన్న ,పోచా జగదీశ్వరరెడ్డి, , ఉమ్మడి జిల్లాల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

ఎలాంటి అనుమతులు తీసుకోకుండా...

జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలలకు ప్రభుత్వ శాఖల అధికారులు తరచూ గైర్హాజరు కావడంపై జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అసహనం వ్యక్తంచేశారు. సహేతుకమైన కారణం లేకుండా, ఎలాంటి అనుమతి తీసుకోకుండా సమావేశాలకు గైర్హాజరయ్యే అధికారులకు నోటీసులు జారీ చేయాలని పాపిరెడ్డి డిప్యూటీ సీఈవో వెంకటసుబ్బారెడ్డిని ఆదేశించారు.

పీఆర్ కమిషనర్‌కు ఫిర్యాదు

జడ్పీ నిధులతో నిర్ణీత సమయంలో చేపట్టాల్సిన పనులపై నిర్లక్ష్యంగా వ్యవహరించి రూ.2.50 కోట నిధులు ల్యాప్స్ అయ్యేందుకు కారణమైన పీఆర్ ఇంజనీర్లపై చర్యలు తీసుకునేందుకు పీఆర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి చెప్పారు. ఈపనులను ఈఏడాది సెప్టెంబరు ఆఖరికి పూర్తిచేయకుంటే నిధులు ల్యాప్స్ అయ్యే ప్రమాదముందని ప్రతి నెలా పీఆర్ ఇంజనీర్లను హెచ్చరిస్తూనే ఉన్నా మన్నారు. అయినా పనుల్లో జరిగిన జాప్యంతో రూ.2.50కోట్ల నిధులు ల్యాప్స్ అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు.

జోరుగా అవినీతి, అక్రమాలు

ఉపాధి హామీ పథకం పనుల్లో క్షేత్రస్థాయిలో అవీనతి అక్రమాలు జోరుగా జరు గుతున్నాయని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. గృహనిర్మాణాల ఫ్లెక్సీలు పెట్టుకుని ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోందని, ఇసుక రీచుల్లో వంద శాతం వాహనాల్లో గృహనిర్మాణాలకు అంటూ, 70వాహనాల్లో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారన్నారు.

భవిష్యత్తుకు పునాది పాఠశాలలోనే..


కర్నూలులో మాట్లాడుతున్న విద్యాశాఖ అధికారులు


నంద్యాలలో మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

- విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు, ప్రిన్సిపల్ సెక్రెటరీ కోన శశిధర్
- కర్నూలు, నంద్యాలలో నూతన ఉపాధ్యాయులకు శిక్షణ

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తుకు పునాది పాఠశాలలోనే పడుతుందని విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ పేర్కొన్నారు. మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు శుక్రవారం నగర శివారులోని రాఘవేంద్ర బీఈడీ కళాశాలలో శిక్షణను ప్రారంభించారు. శాస్త్రీయ దృక్పథం, సాంకేతిక పరిజ్ఞానంతో పాటు విలువలతో కూడిన బోధనతో నవసమాజాన్ని నిర్మించాలని కోరారు. ప్రభుత్వ విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. డీఈవో శామ్యూల్ పాల్ మాట్లాడుతూ జిల్లాలో అధిక సంఖ్యలో ఉపాధ్యాయ పోస్టులు మంజూరయ్యాయన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో దాదాపు అన్ని పోస్టులు భర్తీ చేయగలిగామని తెలిపారు. రిసోర్స్‌పర్సన్లు చెప్పే విషయాలను రాసుకుని అమలు చేయాలని కోరారు.

ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేయాలి : డీఈవో

పాణ్యం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేయాలని డీఈవో జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం విజయానికేతన్ పాఠశాలలో మెగా డీఎస్సీ ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని డీఈవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. విద్యార్థులకు పునాదిలోనే క్రమశిక్షణతో కూడుకున్న చదువునందించాలన్నారు. ఈరోజునుంచి ఉపాధ్యాయులకు కొత్త జీవితం ప్రారంభమవుతుందని అన్నారు. కుటుంబ సమస్యలను అధిగమించి వృత్తికి న్యాయం చేయాలని అభిప్రాయపడ్డారు. జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో 1,030 మంది ఉపాధ్యాయులకు ఈనెల 10 తేదీ వరకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కర్నూలులో శిక్షణకు అనుకూలంగా లేకపోవడంతో అనంతపురంలో రెండు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2,600ల మంది శిక్షకులు పాల్గొంటారన్నారు. శిక్షణకు హాజరుకాని ఉపాధ్యాయులు వచ్చే నెల విజయవాడలో నిర్వహించే శిక్షణలో పాల్గొనాలన్నారు. శిక్షణలో పాల్గొనని ఉపాధ్యాయులకు ఆర్డర్ కాపీ ఇవ్వమన్నారు. శిక్షణలో పాల్గొన్న వారికి ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. పాణ్యంలో 450 మంది శిక్షణలో పాల్గొంటున్నట్లు తెలిపారు. శిక్షణా కేంద్రాలలో వైద్య సహాయం, అంబులెన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కోర్స్ డైరెక్టర్లు కోటయ్య, వెంకటేశ్వరరెడ్డి, ఎంఈవో సుబ్రహ్మణ్యం, అలెస్కో సభ్యులు ప్రసన్నకుమార్, విజయానికేతన్ కరస్పాండెంట్ సంధ్యారాణి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల గుర్తింపులో జాప్యం ఎందుకు?

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని అక్రమ నిర్మాణాలను గుర్తించడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం నగర పాలక సమావేశ భవనంలో పట్టణ ప్రణాళికా విభాగం అధికారుల, సిబ్బందితో కలిసి ఓపెన్ ఫోరం నిర్వహించారు. అర్జీదారులు తమ సమస్యలను వెల్లడించగా, పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సచివాలయ పరిధిలోని ప్లానింగ్ కార్యదర్శి, కార్యదర్శులు గుర్తించిన అక్రమ నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఆదేశించామన్నారు. అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిటి ప్లానర్ ప్రదీప్‌కుమార్, డీసీపీ వెంకటరమణ, టీపీవో అంజాద్ బాష, సూపరింటెండెంట్ సుబ్బన్న పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి

మహానంది, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్ దంపతులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయం ముఖమంటపం వద్ద అర్చకులు స్వాగతం పలికారు. న్యాయమూర్తి దంపతులు ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లను దర్శించుకొని అభిషేకార్చన పూజలు నిర్వహించారు. అలంకార మంటపంలో వేదపండితులు ఆశీర్వదించారు. ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి సన్మానించి, స్వామివారి చిత్రపటంతో పాటు ప్రసాదాలు అందజేశారు.

మంత్రాలయంలో..

మంత్రాలయం: రాఘవేంద్ర స్వామి దర్శనార్థం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ గాడి ప్రవీణ్‌కుమార్ శుక్రవారం రాత్రి మంత్రాలయానికి వచ్చారు. పద్మనాభ వివిపీ గెస్ట్‌హౌస్ వద్ద ఆయనకు మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి, సురేష్ కోణాపూర్, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి ఘనంగా స్వాగతం పలికారు. రాత్రి మంత్రాల యంలోనే బస చేసి శనివారం ఉదయం గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేయనున్నారు. ఎస్‌ఐ శివాంజల్, జయతీర్థఆచార్, వ్యాసరాజాచార్, ఆంజనేయులు ఉన్నారు.

మంత్రాలయానికి పోటెత్తిన భక్తులు


మంత్రాలయంలో భక్తుల రద్దీ

మంత్రాలయం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయానికి భక్తులు పోటెత్తారు. గురువారం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం ఆంధ్రా, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. అన్నపూర్ణ భోజనశాల, మహా ముఖ ద్వారం, ప్రధాన రోడ్లు, రాఘవేంద్ర సర్కిల్ భక్తులతో కోలాహలంగా మారింది. తుంగభద్ర నదిలో పుణ్య స్నానాలచరించి గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూలబృందావనానికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఎస్ఐ శివాంజల్, పోలీసులు, శ్రీమఠం సెక్యూరిటీ ఆధ్వర్యంలో శ్రీమఠం ప్రాంగణంలో క్యూలైన్లు అదనంగా ఏర్పాటుచేశారు. ప్రసాదాల కొరత రాకుండా మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్ ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేశారు. లక్షలాది మంది భక్తులు తరలిరాగా దర్శనానికి నాలుగు గంటల సమయం పట్టింది. ఎలాంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. దర్శనం చేసు కున్న భక్తులు ప్రాకారం నుంచి బయటికి వెళ్లాలని మఠం అధికారులు సూచించారు.

వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య ఘర్షణ

- నలుగురికి గాయాలు
- ఐదుగురిపై కేసు నమోదు

కోవెలకుంట్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలుగొట్ల గ్రామంలో వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య ఘర్షణ జరిగి ఇరువురు కర్రలు, రాళ్లతో దాడి చేసుకోవడంతో ఇద్దరు వైసీపీ కార్యకర్తలకు రక్త గాయాలయ్యాయి. మరో ఇద్దరికి మూగ గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం జరిగింది. కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్, రేవనూరు ఎస్ఐ భూపాలుడు తెలిపిన వివరాలివీ.. కలుగొట్ల గ్రామంలో విజయదశమి పండుగ రోజున కనక దుర్గమ్మ గుడి వద్ద భజన చేయడానికి వైసీపీ వర్గీయులు పట్టుబట్టారు. దీంతో ఆలయ నిర్వాహ కులు వద్దని చెప్పి సర్దిచెప్పారు. అయితే వైసీపీ వర్గీయులు భజన చేయకపోవడానికి అసలు కారణం టీడీపీ వర్గీయులైన గడ్డం నాగార్జునరెడ్డి, శ్రీనివాసరెడ్డి అని, వీరిరువురినీ లేకుండా చేయాలని వైసీపీ వర్గీయులు చర్చించుకున్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ కార్యకర్తలు అడిగేందుకు వెళ్లి వాగ్వాదం జరిగి మాట మాటా పెరిగి రాళ్లతో దాడి చేసుకున్నారు. దీంతో తలారి శ్రీనివాసులు, పెద్దగురప్పకు రక్తగాయాలు కాగా మరో ఇద్దరికి మూగగాయాలయ్యాయి. సీఐ, ఎస్ఐ గ్రామానికి చేరుకుని ఇరువర్గాలను అదుపులోకి తీసుకుని విచారించారు. గాయపడ్డ శ్రీనివాసులు, పెద్దగురప్పను కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రథమ చిత్స చేయించారు. బాధితుడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు నాగార్జున్‌రెడ్డి, చిన్నవలి, శీను, శేషు, వెంకటేశ్‌పై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కలుగొట్లలో వైసీపీ, టీడీపీ మధ్య ఘర్షణ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి చేరుకుని కార్యకర్తలను పరామర్శించారు.

ప్రభుత్వ లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు

- నివాళి అర్పించిన ఎమ్మెల్యే, అధికారులు


జవాన్‌కు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

పగిడ్యాల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లో హవాల్దార్‌గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన ఆర్మీ జవాన్ బరికేల తిక్కస్వామి (34) అంత్యక్రియలు స్వగ్రామమైన పగిడ్యాలలో గురువారం ప్రభుత్వ లాంచనాలతో నిర్వహించారు. అనారోగ్యంతో ఢిల్లీలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందడంతో తిక్కస్వామి భౌతికకాయాన్ని ఆర్మీ మేజర్ రాహుల్ దత్ ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనంలో పగిడ్యాలకు గురువారం ఉదయం తీసుకొచ్చారు. దీంతో గ్రామంలో పండగ పూట విషాదచాయలు అలుముకున్నాయి. చుట్టు పక్కల గ్రామాలైన బీరవోలు, అంజనేయ నగర్, సంకిరేణిపల్లె, లక్ష్మాపురం తదితర గ్రామాలకు చెందిన ప్రజలు, బంధువులు అధిక సంఖ్యలో గ్రామానికి చేరుకొని నివాళి అర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే గిత్తా జయసూర్య జవాన్ తిక్కస్వామి భౌతికకాయానికి నివాళి అర్పించారు. అనతరం అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తిక్కస్వామి కుంటుబ సభ్యులను ఓదార్చి ప్రభుత్వం అండగా ఉంటుం దన్నారు. అలాగే తహసీల్దార్ శివరాముడు, రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, నాయకులు నివాళి అర్పించారు. అనంతరం గాలిలోకి కాల్పులు జరిపి సైనిక లాంచనాలతో అంతక్రియలు నిర్వహించారు.



పట్టణంలోని గాంధీవిగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘాల నాయకులు

మహాత్మాగాంధీకి ఘన నివాళి

నంద్యాల కల్చరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గాంధీ జయంతిని గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఆర్యవైశ్య జిల్లా సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీచౌక్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బింగుమళ్ల శ్యామ్‌సుందర్ గుప్తా, సంఘం గౌరవాధ్యక్షుడు, కౌన్సిలర్ ఖండే శ్యామ్‌సుందర్ లాల్, జిల్లా సంఘం నాయకులు, కార్యకర్తలు, నంద్యాల ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: జాతిపిత గాంధీజీ అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని టీడీపీ జిల్లా వైస్‌ఛైర్మన్ మనోహర్‌చౌదరి, యువనాయకుడు వడ్డు మధుసూదన్‌రెడ్డి సూచించారు. గురువారం గాంధీ జయంతిని సందర్భంగా పలు గ్రామాల్లో గ్రామ సభలు జరిగాయి. ఏ కోడూరులో టీడీపీ నాయకుడు మధుసూదన్‌రెడ్డి పారిశుధ్య కార్మికులకు పనిముట్లను అందజేశారు. నారాయణాపురంలో ఏపీవో వసుధ ఆధ్వర్యంలో పశువుల షెడ్ల నిర్మాణాలకు భూమి పూజలు చేశారు. కార్యక్రమాల్లో సర్పంచ్ జ్యోతి భరణం, టీడీపీ మండల కన్వీనర్ వృష్టారెడ్డి, నాయకులు శంకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రామచంద్రగౌడ్, ఆంబ్రోస్, వెంకటసుబ్బయ్య, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

నందికొట్కూరు: జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని నెలకొల్పేందుకు టీడీపీ ప్రభుత్వం పయనిస్తోందని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. గురువారం గాంధీ జయంతి సందర్భంగా పట్టణంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు బాస్కర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ రబ్బాని, సొసైటీ ఛైర్మన్ ముర్తుజావలి, నాయకులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి డిప్యూటీ తహసీల్దార్ నాగన్న, రెవెన్యూ సిబ్బంది పూలమాల వేసి నివాళి అర్పించారు.

పగిడ్యాల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జడ్పీటీసీ పుల్యాల దివ్య, ఇన్‌ఛార్జి ఎంపీడీవో నాగేంద్ర కుమార్ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ శేషన్న, సిబ్బంది పాల్గొన్నారు.



పగిడ్యాల ఎంపీడీవో కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జడ్పీటీసీ దివ్య

పని చేసేవారికి గుర్తింపు: ఎమ్మెల్యే



వేంపెంటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

పాములపాడు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం పనిచేసిన నాయకులకు, కార్యకర్తలకు టీడీపీ గుర్తింపు ఇస్తుందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. శుక్రవారం వేంపెంట గ్రామంలో కేశవ రామచంద్ర ఆంజనేయస్వామి దేవాలయం ఛైర్మన్‌గా రాముసుబ్బయ్య ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. దేవాదాయశాఖ అధికారులు నూతన ధర్మకర్తల మండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు సింగూరు నాగేశ్వరరావు, నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ రవీంద్రరెడ్డి, సర్పంచ్ మానిక్యమ్మ, సొసైటీ ఛైర్మన్ లక్ష్మీకాంతరెడ్డి, గోవింద, రాజశేఖర్ వినయ్, సత్యరాజ్, శివకుమార్, నాయిని క్రిష్ణయ్య, ఆదిరెడ్డి, మోహన్‌గౌడ్, బాలస్వామి, రమణారెడ్డి, చంద్రశేఖర్, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుర్గాభోగేశ్వర ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన ఆలయ కమిటీ సభ్యులు

గడివేముల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన దుర్గాభోగేశ్వర ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ ఛైర్మన్‌గా కంది శ్రీనివాసులును ఎన్నికవగా ఎన్నుకున్నారు. సభ్యులుగా లింగారెడ్డి, శంకర్‌రెడ్డి, లక్ష్మీదేవి, ప్రసాద్, మల్లేశ్వరి, అశోక్, శైలజ, సుమంగళి, కాశవతీబాయి, వెంకటసుబ్బమ్మలు, ఎక్స్ అఫిషియో మెంబర్‌గా శామ్‌సుందర్‌శర్మతో ఆలయ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి పీఎల్ఎన్ రామానుజన్, పాణ్యం నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షుడు కృష్ణయాదవ్, టీడీపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

అండర్ పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలి



హైవే పనులను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు,దళితులు

ఆత్మకూరురూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బాపనంతాపురం గ్రామ సమీపంలో అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి రణధీర్ డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో గ్రామ రైతులు, దళితులతో కలిసి గ్రామ శివారులోని హైవే పనులను పరిశీలించారు. గ్రామంలో గ్రామ సభ నిర్వహించి ప్రజల అభిప్రాయం మేరకు అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు. గ్రామ రైతులు, దళిత నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా దసరా

- ఆలయాల్లో పూజలు చేసిన భక్తులు
- వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు
- జమ్మి ఆకుతో శుభాకాంక్షలు తెలుపుకున్న ప్రజలు

నందికొట్కూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): విజయ దశమి వేడుకలను ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. పట్టణంలో జరిగిన దసరా ఉత్సవాల్లో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పాల్గొన్నారు. శమీ చెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట పట్టణాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి తదితరులున్నారు. సాయంత్రం పట్టణంలోని పంచముఖి వినాయకుడి వద్ద నుంచి మేళ తాళాలతో ఆత్మకూరు రోడ్డులోని జమ్మి(శమీ) చెట్టు వరకు భారీగా జనం తరలివెళ్లారు. పట్టణంలోని ప్రతి దేవాలయం నుంచి ఉత్సవ మూర్తులు ఊరేగింపుగా జమ్మిచెట్టు వరకు వచ్చారు. శమీ ఆకులను ఒకరికి ఒకరు ఇచ్చుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ సుబ్రమణ్యం, టీడీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మీనాక్షిదేవి, వనజ, దసరా ఉత్సవ కమిటీ సభ్యులు అల్వాల బాలయ్య, శ్రీధర్, భానుప్రకాష్, శేఖర్, భక్తులు పాల్గొన్నారు.

ముచ్చుమర్రిలో బైరెడ్డి సోదరుల పూజలు

పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఆయన సోదరుడు బైరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి దంపతులు శివాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి శమీ చెట్టు వద్దకు అమ్మవారి ఊరేగింపుగా వెళ్లి పూజలు నిర్వహించారు.



ఆత్మకూరులో శమీ వృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు



పాములపాడులో పల్లకి మోస్తున్న మహిళలు



నంద్యాలలో జమ్మిచెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న పట్టణవాసులు



నంద్యాలలో ఆకట్టుకున్న దసరా ఉత్సవాలు



నందికొట్కూరులోని శమీ చెట్టు వద్ద పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య



బండిఆత్మకూరు: పెద్దదేవళాపురంలో గరుడవాహనంపై వరదరాజస్వామి గ్రామోత్సవం

నంద్యాల కల్చరల్: విజయదశమి వేడుకలను జిల్లా ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గురువారం ఉదయం ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం స్వాముల వార్లను పల్లకీలో చేర్చి గ్రామోత్సవాలు నిర్వహించారు. పట్టణంలోని కాశీకాంబ ఆలయం, బ్రహ్మనందీశ్వరాలయం, వెంకటేశ్వరాలయం, సంజీవనగర్‌రామాలయం, అమ్మవారిశాల, నిమిషాంబదేవి, మద్దిలేటిస్వామి ఆలయాల్లో పూజలు చేశారు.

జమ్మిచెట్టు కు ప్రత్యేక పూజలు

పట్టణంలోని సంజీవనగర్ రామాలయం, బస్టాండు దగ్గర గల ఆంజనేయ కోదండరామస్వామి దేవస్థానం, బ్రహ్మనందీశ్వర స్వామి, శ్రీకృష్ణమందిరం తదితర ఆలయాలలో గల జమ్మిచెట్ల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జమ్మి ఆకు ఇచ్చిపుచ్చుకుంటూ దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. భక్తులు పట్టణంలోని ఆలయాలను సందర్శించి వివిధ రూపాలలో వెలసిన అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఆత్మకూరు: విజయదశమి వేడుకలను ఆత్మకూరు ప్రాంతంలో వైభవంగా జరిగాయి. పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ, చౌడేశ్వరీ అమ్మవారు విజయలక్ష్మీదేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పురప్రజలు పట్టణ శివార్లలోని శ్రీశైలం రస్తాలో వున్న శమీవృక్షం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పట్టణంలోని ఆలయాలకు వెళ్లి దేవతామూర్తులను దర్శించుకున్నారు.

బండిఆత్మకూరు: మండలంలో విజయదశమి వేడుకలను ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గురువారం ఉదయం ప్రజలు ఆయా గ్రామాల్లోని ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం స్వామివార్లను పల్లకీలో చేర్చి గ్రామోత్సవాలు నిర్వహించారు. శమీవృక్ష ప్రదక్షిణలు చేసి, శమీపత్రం పెద్దలకు అందజేసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఓంకారం, కృష్ణనంది క్షేత్రాల్లో ఈవోలు నాగప్రసాద్, వేణునాథరెడ్డిల ఆధ్వర్యంలో శరన్నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు.

పాములపాడు: మండలంలోని పాములపాడులో గ్రామ శివార్లలోని శమీవృక్షం వద్దకు అమ్మవారిని పల్లకిలో తీసుకెళ్లి గ్రామస్థులు పూజలు చేశారు. విజయ దశమి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పురోహితులు కోదండరామయ్య శర్మ తీర్థప్రసాదాలు అందించారు. అలాగే క్రిష్ణారావుపేటలో కూడా పూజలు చేశారు.

జూపాడుబంగ్లా: దేవీశరన్నవరాత్రుల్లో భాగంగా గురువారం విజయదశమి వేడుకలతో ఉత్సవాలు ముగిశాయి. గ్రామాల్లో భక్తులు అమ్మవారిని గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయాల వద్ద ఉన్న జమ్మిచెట్టుకు పూజలు చేశారు. జూపాడుబంగ్లాలో మహిళలు బోనాలతో అమ్మవారిని ఊరేగించారు.

భక్తిశ్రద్ధలతో దుర్గమ్మ నిమజ్జనోత్సవం



నంద్యాల సాయిబాబా ఆలయంలో దుర్గామాతను నిమజ్జనానికి తరలివచ్చిన భక్తులు





ఆత్మకూరు, పాణ్యంలో అమ్మవారి విగ్రహాల ఊరేగింపు

నంద్యాల కల్చరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గత తొమ్మిదిరోజులుగా పూజలు అందుకున్న దుర్గాదేవి అమ్మవారిని 11వ రోజు శుక్రవారం చెరువుకట్ట దగ్గర వినాయక ఘాట్‌లో నిమజ్జనం చేశారు.మద్దిలేటిస్వామి ఆలయంలో మధుసూదనరాయల్, ఉప్పరిపేటలో, గిరినాద్ సెంటర్‌లో ప్రతిష్ఠించిన అమ్మవారికి గత తొమ్మిది రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రత్యేక మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించి అనంతరం వినాయక ఘాట్‌లో నిమజ్జనం చేశారు.బొమ్మలసత్రం సాయిబాబా ఆలయంలో ప్రతిష్ఠించిన దుర్గమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి అంగరంగవైభవంగా కోలాట నృత్యప్రదర్శన చేస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం సాయికమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కుందూనదిలో అమ్మవారి విగ్రహ నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటి అధ్యక్షులు మల్లికార్జున రెడ్డి రాజగోపాల్‌రెడ్డి, సభ్యులు శివనాగేంద్రరెడ్డి,మధుమోహన్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఆత్మకూరులో...

ఆత్మకూరు: దేవీశరన్నవరాత్రులను పురస్కరించుకుని పట్టణంలోని సిద్దేశ్వరాలయం, కిషన్‌సింగ్ వీధి, అంబా భవానీ, ఆర్కేకాలనీ వీధుల్లో ప్రతిష్ఠించిన దుర్గాదేవీ అమ్మవారి నిమజ్జన మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా పట్టణంలో అమ్మవారి శోభాయాత్రను నిర్వహించారు. అనంతరం పాములపాడు మండలం ఎర్రగూడూరు గ్రామ సమీపంలో వున్న శ్రీశైలం కుడిగట్టు ప్రధాన కాల్వలో నిమజ్జనం చేశారు.

పాణ్యం: మండల కేంద్రంలోని అయ్యప్పరెడ్డి కాలనీలో ఫ్రెండ్స్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని గురువారం నిమజ్జనం చేశారు. నిమజ్జన కార్యక్రమంలో మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



బొమ్మలసత్రంలో కోలాటం ఆడుతున్న మహిళలు



ఆత్మకూరులో దుర్గాదేవి శోభాయాత్రలో కిషన్ సింగ్ వీధికి చెందిన మహిళలు



నంద్యాల: చిన్నచెరువులో దుర్గామాత విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు

మహానందికి ఉత్సవమూర్తులు

నంద్యాల కల్చరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): సాంప్రదాయం ప్రకారం దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో పాల్గొని ప్రత్యేక ప్రత్యేక పూజలు అందుకున్న మహానందీశ్వరుడి ఉత్సవమూర్తులు శుక్రవారం మహానందికి బయలుదేరారు. ఆనవాయితీగా వస్తున్న ప్రకారం పట్టణంలోని బ్రహ్మనందీశ్వరస్వామి ఆలయంలో జరిగిన దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనడానికి మహానందీశ్వరుని ఉత్సవమూర్తుల విగ్రహాలు గత ఆదివారం (21.9.25) నంద్యాలకు చేరుకున్నాయి. ఉత్సవమూర్తులకు నంద్యాల బ్రహ్మనందీశ్వర స్వామి ఆలయ ఈవో లక్ష్మీనారాయణ, అర్చకులు మేళతాళాలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి బ్రహ్మనందీశ్వరుని ఆలయానికి చేరుకున్నాయి. అనంతరం నంద్యాలలో జరిగే శరన్నవరాత్రి ఉత్సవాలలో మహానందీశ్వరుడు పాల్గొని ప్రత్యేక పూజలు అందుకున్నారు. దసరా ఉత్సవాలు ముగిశాక తిరిగి ఉత్సవమూర్తులను శుక్రవారం ప్రత్యేక పల్లకిలో గ్రామోత్సవం నిర్వహించి మహానందికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో నంద్యాల బ్రహ్మనందీశ్వరస్వామి ఆలయ అర్చకులు, సిబ్బంది, మహానందీశ్వరస్వామి దేవస్థానం ఈవో, ఏఈవో, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వాసవీమాత గ్రామోత్సవం

ఆత్మకూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని 11రోజుల పాటు వివిధ దేవతామూర్తుల రూపాల్లో దర్శనమిచ్చిన వాసవీ కన్యకాపరమేశ్వరీ గ్రామోత్సవం శుక్రవారం రాత్రి శోభాయమానంగా సాగింది. ఈ ఉత్సవానికి పురస్కరించుకుని అమ్మవారిని విశిష్ట అలంకరణ గావించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. శోభాయాత్ర పెద్దబజారు, గాంధీపార్క్, తోటగేరి మీదుగా పాతబస్టాండ్ సమీపంలోని ఆత్మలింగేశ్వరాలయం వరకు సాగింది. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కాగా శనివారం ఉదయం 9గంటలకు వసంతోత్సవం, రాత్రి 8గంటలకు శయనోత్సవ క్రతువులను కూడా ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాటు చేపట్టింది.



గ్రామోత్సవంలో వాసవీమాత

అంకాళమ్మకు విశేష పూజలు

శ్రీశైలం,అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): లోక కల్యాణం కోసం శ్రీశైల క్షేత్రం గ్రామదేవత అంకాళమ్మ శుక్రవారం ఉదయం అభిషేకం, విశేష పూజలను చేశారు. అంతకుముందు మహాగణపతిపూజ చేశారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా ఊయలసేవ

శ్రీశైలం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీశైలక్షేత్రంలో స్వామి అమ్మవార్లకు ఊయల సేవను శుక్రవారం నిర్వహించారు. ముందుగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లకు విశేష పుష్పాలంకరణ, షష్ఠోపచార పూజలు చేశారు.

ప్లాస్టిక్ వస్తువులు వాడరాదు

శ్రీశైలం, అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి): నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు వాడరాదని శ్రీశైలం అటవీశాఖ సబ్ డీఎఫ్‌వో బబిత కుమారి సూచించారు. శుక్రవారం సందర్భంగా కాలినిలో ఏపీ అటవీశాఖ వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహించారు. ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ చేపట్టారు. అటవీశాఖ కార్యాలయం నుంచి అడవులను రక్షిద్దాం - వన్యప్రాణులను కాపాడుదాం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో వరమేశులు, డిప్యూటీ జబీర్ అహమ్మద్, ఎస్ఏఎస్‌వో మదన్‌కుమార్, ఈడీసీ ఛైర్‌పర్సన్ ఎన్.నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు

వన్యప్రాణులను కాపాడుకుందాం

వెలుగోడు : అడవులను పెంచి పర్యావరణను పరిరక్షించుకొని వన్యప్రాణులను కాపాడుకుందామని ఆత్మకూరు డివిజన్ వెలుగోడు ఇన్‌ఛార్జి అటవీ అధికారి తాహేర్ అన్నారు. వన్యప్రాణి వారోత్సవాలు పురస్కరించుకొని శుక్రవారం వెలుగోడులో ర్యాలీ నిర్వహించారు. వన్యప్రాణులు, అడవుల ప్రాముఖ్యత గూర్చి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో సామాన్యుడికి ఊరట

నంద్యాల రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో సామాన్యుడితో పాటు మత్స్య రంగానికి ఊరట లభించిందని మత్స్యశాఖ జిల్లా అధికారి పీ.రామ నాయక్ అన్నారు. శుక్రవారం మత్స్యశాఖ కార్యాలయం గ్రామంలోని ఆక్వాకల్చర్, కమ్యూనిటీ హాల్‌లో మత్స్యకారులకు తగ్గిన జీఎస్టీపై అవగాహన కల్పించారు. సమావేశంలో వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్లు చందన హర్ష, లక్ష్మీనాయక్, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ సునీతారెడ్డి, ఏసీటీవో అబ్దుల్ రఫీక్, మత్స్యశాఖ అధికారి డాక్టర్ పామన్న పాల్గొన్నారు.

కొత్త పథకానికి ప్రభుత్వం శ్రీకారం



ఎంపీ శబరి

నంద్యాల రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సంక్షేమం దిశగా మరో అడుగు ముందుకేసిందని ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ డ్రైవర్ల సంక్షేమం కోసం ఆటో డ్రైవర్ సేవలో పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. గత ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఏడాదికి కేవలం రూ.10 వేలు మాత్రమే ఇచ్చిందన్నారు. గత ప్రభుత్వంలో 261516 మాత్రమే అర్హులుగా గుర్తించి రూ.261.50 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. తమ కూటమి ప్రభుత్వం ఆ పథకం కింద అర్హులైన ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేల చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. 2.90 లక్షల మందికి రూ.436 కోట్లు లబ్ధి చేకూరుతుందన్నారు.

రేషన్ షాపులో విజిలెన్స్ దాడులు

నంద్యాల టౌన్ అక్టోబర్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు దుకాణాల్లో విజిలెన్స్, రెవెన్యూ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. పట్టణంలోని జ్ఞానపురం రేషన్ షాపులో సోదాలు చేశారు. విజిలెన్స్ సీఐ పవన్‌కుమార్ మాట్లాడుతూ.. నిల్వల్లో తేడాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. నివేదికలను తహసీల్దార్‌కు అందజేస్తామన్నారు. ఆర్ఐ ప్రసాద్, వీఆర్‌వోలు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

బుక్కాపురంలో భూ రీ సర్వే



భూమిపూజ చేస్తున్న తహసీల్దారు

మహానంది, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం బుక్కాపురంలో శుక్రవారం భూ రీ సర్వేను తహసీల్దార్ రమాదేవి ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. ఈ సందర్భం గా భూమి పూజ చేసి సర్వే పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కామేశ్వరరెడ్డి, సర్పంచ్ వరలక్ష్మి, ఎంపీ టీసీ కుంచెపు లక్ష్మీనరసమ్మ, నాయకులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలంలోని ఎదురుపాడు, గువ్వలకుంట్ల గ్రామాల్లో తహసీల్దార్ ఉమారాణి భూరీసర్వే పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో భూరీసర్వే డీటీ పెద్దన్న, సొసైటీ కొత్తపల్లి పేష్ ఇమామ్, నాగంపల్లి సొసైటీ ఛైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, రామలింగారెడ్డి, పోత నారాయణ, వీఆర్వోలు అశోక్, రామసుబ్బయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు గ్రామంలోని 35 బొల్లవరం పొలిమేరలో శుక్రవారం తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ రీసర్వేను ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాగన్న, ఏఎస్‌వో హనుమంతు, సర్వేయర్ ఆశీఫ్, వీఆర్వోలు, మాజీ సర్పంచులు లక్ష్మన్నగౌడ, క్రిష్ణగౌడ్, వీరారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు



మాట్లాడుతున్న ముఖ్య వక్త

నంద్యాల రూరల్ అక్టోబర్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని క్రాంతి నగర్‌లో రామాలయంలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది విజయ దశమి ఉత్సవాలు నిర్వహించారు. మానవీయనగర్ సంఘచాలక్ కుంచా మహేశ్వరరెడ్డి తెలిపారు. ముఖ్య అతిథిగా ఎస్ఆర్ విద్యా సంస్థల అధినేత దినేష్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. పంచ పరివర్తన లక్ష్యాల దిశగా ప్రతి ఒక్కరూ పయనించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

కరెంటు కోతతో ప్రజల ఇబ్బందులు

- నిలిచిపోయిన ఆన్‌లైన్ సేవలు..

పాములపాడు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కరెంటు కోతతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. శుక్రవారం ఉదయం 9.30నుంచి సాయంత్రం 4.30గంటల వరకు ఏకధాటిగా ఏడు గంటల పాటు కోత విధించారు. ముందస్తు సమాచారం లేకుండా కరెంటు కోత విధించడంతో ప్రజలు ఇక్కట్లు పడ్డారు. మరోవైపు కార్యాలయాల్లో ఆన్‌లైన్ సేవలు నిలిచిపోవడంతో అధికారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

అహోబిలంలో ద్వార తోరణ పూజ



లక్ష్మీనరసింహస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో లక్ష్మీనరసింహస్వామి పవిత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఎగువ అహోబిలంలో వేద పండితులు ద్వార తోరణం కార్యమాన్ని నిర్వహించారు. పవిత్రోత్సవాలలో ఎలాంటి ఆటంకాలు కలగకుండా వైష్ణవ సంప్రదాయంలో విశ్వక్సేనుని ఆరాధించి పూజలు నిర్వహించారు. ధ్వజాన్ని ఆలయ ధ్వజస్తంభంపై ఆరోహణం చేశారు. భేరి పూజతో సమస్త దేవతలకు ఆహ్వానం పలికారు. దేవస్థానం ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాల్ స్వామి ఆధ్వర్యంలో విశ్వరూపం, నవకలశ స్థాపన పూర్వక తిరుమంజనం, యాగశాలలో అగ్ని ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. పవిత్రోత్సవాలను పురస్కరించుకొని జ్వాలా నరసింహస్వామి, చెంచులక్ష్మీ అమ్మవార్ల మూలవిరాట్, ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాన్ని తిలకించడానికి భక్తులు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు.

మలేరియా, డెంగీ పరీక్షలు నిర్వహించాలి

జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకట రమణ



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా వైద్యాధికారి

శిరివెళ్ల, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యశాలల్లో మలేరియా, డెంగీ నిర్ధారణ పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకట రమణ సూచించారు. శిరివెళ్లలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన శుక్రవారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తంగా ఉంచాలన్నారు. ఫార్మసీలో అవసరమైన మేర మందులను నిల్వ చేసుకోవాలని.. కాలం చెల్లిన మందులను తీసివేయా లని సూచించారు. మాతా శిశు సంరక్షణలో భాగంగా ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాలను ప్రోత్సహించాలన్నారు. ఆసుపత్రిలో ఇప్పటి వరకు జరిగిన ప్రసవాల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైద్యురాలు అఫ్రూజ్ భాను, స్టాఫ్‌నర్స్ పునీత, ఫార్మసిస్ట్ రాజేశ్వరి ఉన్నారు.

జింకను రక్షించిన స్థానికులు, పోలీసులు

ఉయ్యాలవాడ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చిన్న వంక వాగులో చిక్కుకున్న జింకను స్థానికుల సాయంతో పోలీసులు కాపాడారు. గురువారం ఉదయం ఓ క్రిష్ణ జింకను కుక్కలు తరుముతుండగా అది వచ్చి చిన్న వంక వాగులో చిక్కుకుంది. దీన్ని స్థానికులు గమనించి కుక్కలను తరిమివేసి, పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకొని స్థానికుల సాయంతో జింకను బయటకు తీసికొని వచ్చి స్టేషన్‌లోని ఓ గదిలో ఉంచారు. అనంతరం ఫారెస్ట్ అధికారులకు సమాచారమిచ్చారు. బనగానపల్లె ఎఫ్ఆర్వో మక్బూల్ తన సిబ్బందితో అక్కడికి చేరుకొని, జింకకు వైద్య పరీక్షలు జరిపి అక్కడి నుంచి తమ వాహనంలో తీసుకెళ్లి బనగానపల్లె అడవిలో వదిలినట్లు తెలిపారు.

ఆలేబాద్‌కు బస్సు సర్వీసు

ప్యాపిలి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమీది గ్రామాలు ఆలేబాదు, ఆలేబాదు తాండా, మునిమడుగు గ్రామాలకు శుక్రవారం ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభమైంది. దశాబ్దాల కల నెరవేరడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బస్సు సౌకర్యం ఏర్పాటు చేసిన డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి, టీడీపీ నాయకులు పరమేష్‌తో పాటు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామీణ క్రీడలను కలిసి కట్టుగా జరుపుకోవాలి

ప్యాపిలి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడలను ప్రజలు కలిసికట్టుగా జరుపు కోవాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో దసరా సందర్భంగా ఏర్పాటు చేసిన రాతి దూలం పోటీలను ప్రారంభించారు. కోట్ల మాట్లాడుతూ గ్రామీణ క్రీడలు ఎంతో ఉత్సాహం ఇస్తాయన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్ రెడ్డి, వై.లక్ష్మీనారాయణ యాదవ్, ఆది నారాయణ, సందీప్, సురేంద్ర, తిమ్మారెడ్డి, శ్రీనివాసులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

డోన్ రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): డోన్ రైల్వేస్టేషన్‌లో శుక్రవారం అనారోగ్యానికి గురై మృతి చెందిన యాచకుడు మృతదేహానికి ద్రోణాచలం సేవా సమితి సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. పట్టణ సీఐ ఇంతి యాజ్ బాషా విజ్ఞప్తి మేరకు ద్రోణాచలం సేవా సమితి సభ్యులు అనాథ శవాన్ని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు షాధికానా రాజా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి పక్కన ఉన్న అనాథ శవానికి సమాజ సేవకుడు బిజ్జల నాగేష్ శుక్రవారం దహన సంస్కారాలు చేశాడు. ప్రభుత్వ ఆసుపత్రి పక్కన అనాథ శవం ఉందని తెలియగానే తన ఆటోతో వచ్చి మృతదేహానికి సొంత డబ్బులతో దహన సంస్కారాలు చేశాడు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

చాగలమర్రి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని చింతల చెరువు రహదారిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మాబుహుసేన్ నుంచి 30 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు శుక్రవారం ఎస్ఐ సురేష్ తెలి పారు. దుకాణాల్లో మద్యం కొనుగోలు చేసి అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని గుర్తించి అతడి వద్ద ఉన్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

జీఎస్టీ తగ్గింపు రైతులకు వరం



ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

రుద్రవరం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పరికరాలపై 18శాతం నుంచి 5 శాతానికి తగ్గించడంతో రైతులకు వరంగా మారిందని టీడీపీ మండల కన్వీనర్ రంగనాయకులు, జనరల్ సెక్రెటరీ భూమిరెడ్డి రామ కృష్ణరెడ్డి, ఏవో సుమతి అన్నారు. శుక్రవారం రుద్రవరంలో ర్యాలీ నిర్వహించి పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, పీఆర్ ఏఈ కమాల్ సాహెబ్, టీడీపీ నాయకుడు చంద్రశేఖర్, విస్తరణాధి కారులు రాజు, తబుస్సుం పాల్గొన్నారు.

వైభవంగా దసరా ఉత్సవాలు

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- గ్రామోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

బనగానపల్లె, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. గురువారం భక్తులతో ఆలయాలు కిక్కిరిసిపోయాయి. యాగంటి క్షేత్రం, నందవరం చౌడేశ్వరీమాత, బనగానపల్లె పట్టణంలోని పలు ఆలయాల్లో భక్తులు పోటెత్తారు. శమీ వృక్షానికి భక్తులు పూజలు చేశారు. నందివర్గం, బనగానపల్లె పట్టణంలో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో వసంతోత్సవం నిర్వహించారు. యాగంటి క్షేత్రంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారెడ్డి, మౌళీశ్వరరెడ్డి, ఆలయ అర్చకులు, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, నందవరంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. కూరగాయల శేఖర్ ఆధ్వర్యంలో 12 రోజులు పూజలు చేసి క్రైప చెరువులో దుర్గమ్మ విగ్రహాలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో బీసీ ఇందిరమ్మ పాల్గొని దుర్గామాత విగ్రహానికి పూజలు చేశారు.

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు, చాగలమర్రి గ్రామాల్లో 10 రోజుల పాటు దసరా మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. గురువారం రాత్రి అమ్మవారు విజయలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చెన్నకేశవ, అమ్మవారి విగ్రహాలతో గ్రామోత్సవం చేశారు. శుక్రవారం ఆలయాల అధ్యక్షులు నరసింహయ్య, లక్ష్మీనారాయణ, ధర్మకర్త లక్ష్మణబాబు ఆధ్వర్యంలో వసంతోత్సవం నిర్వహించారు.

ఉయ్యాలవాడ: మండలంలోని ఆయా గ్రామాల్లో దసరా వేడకలను ఘనంగా జరుపుకున్నారు. ఉయ్యాలవాడలో గురువారం సాయంత్రం మేళ తాళాలమ మధ్య సీతారాములు, కోదండరామ స్వాములకు గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం టీడీపీ మండల కన్వీనపర్ బోరెడ్డి రాజశేఖర్‌రెడ్డి గ్రామస్తులతో కలిసి స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణంలో ఉన్న జమ్మిచెట్టుకు ప్రల్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బోరెడ్డి నర్సిరెడ్డి, దస్తగిరిరెడ్డి, అర్జిగారి నరసింహుడు పాల్గొన్నారు.

శిరివెళ్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో దసరాను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అమ్మవారిశాలతో పాటు శైవ, వైష్ణవ ఆల యాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. శిరివెళ్లలోని శివాలయం నుంచి పార్వతీపరమేశ్వరుల ఉత్సవమూర్తులకు గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

కొలిమిగుండ్ల: విజయదశమిని పురస్కరించుకొని తిమ్మనాయినిపేట వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు కన్యకాపరమేశ్వరీగా నిజరూప దర్శనం లో భక్తులకు దర్శనమిచ్చారు. అంకిరెడ్డిపల్లె గీతాశ్రమంలో రాజరాజేశ్వరీదేవి అలంకరణలో భక్తులకు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. కొలి మిగుండ్ల కొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి పల్లకీ ఉత్సవం గురు వారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి ఉత్సవ మూర్తు లను పల్లకిలో ఉంచి గ్రామ వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

రుద్రవరం: స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు పాల్గొన్నారు. రుద్రవరంలో భాస్కర నందీశ్వరస్వామి పార్వేట పల్లకీ ఉత్సవం నిర్వహించారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో దసరా పండుగను ఘనంగా నిర్వహించారు. గురువారం కన్యకాపరమేశ్వరి అమ్మవారు విజయలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దొర్నిపాడు, రామచంద్రాపురం గ్రామాల్లో అమ్మవారిని మేళతాళాలు, కళా కారుల నృత్యాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. శుక్రవారం ఆర్య వైశ్యులు అమ్మవారికి తోటోత్సవం నిర్వహించారు.

పాన్పు సేవ ఆకారంతో వాసవీ మాత

కోవెలకుంట్ల: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు శుక్రవారం కోవెలకుంట్ల పట్టణంలోని వాసవీ కన్య కాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు పాన్పు సేవలో భక్తులకు దర్శన మిచ్చింది. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు ఆలయానికి చేరుకుని వసంతాలు, తులాభారం తోటోత్సవం నిర్వహించారు.

డోన్ రూరల్: డోన్ పట్టణంలోని గుత్తి రోడ్డులో కొలువుదీరిన అమ్మవారి మండపంలో శుక్రవారం రాజరాజేశ్వరీ రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు మండపం నిర్వాహకులు అన్నదానం చేశారు.



రామచంద్రాపురంలో అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు



రుద్రవరం: పార్వేట పల్లకిలో కొలువుదీరిన ఈశ్వరుడికి పూజలు చేస్తున్న భక్తులు



ఉయ్యాలవాడలో జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న గ్రామస్తులు





తిమ్మనాయినిపేట, అంకిరెడ్డిపల్లెలో పూజలందుకున్న అమ్మవార్లు



కొలిమిగుండ్లలో..



కోవెలకుంట్లలో..



బనగానపల్లె: వసంతోత్సవంలో పాల్గొన్న ఆర్యవైశ్యులు



బనగానపల్లె దుర్గామాత విగ్రహానికి పూజలు చేస్తున్న బీసీ ఇందిరమ్మ



చాగలమర్రిలో అమ్మవారి గ్రామోత్సవంలో పాల్గొన్న ఆర్యవైశ్యులు



రుద్రవరంలో..



శిరివెళ్లలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



ఉయ్యాలవాడలో..

అమ్మవారికి వెండి సమర్పణ



వెండి శఠారిని అందజేస్తున్న దాతలు

చాగలమర్రి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): చాగలమర్రిలోని చాగలమ్మ ఆలయంలో దసరా ఉత్సవాల సందర్భంగా శుక్రవారం అమ్మవారికి దాతలు వల్లం రాము కుమార్తె అరుణ, యశ్వంత్‌కృష్ణ దంపతులచే వెండి శఠారిని శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కమిటీ సభ్యులు నర్సిరెడ్డి, రామ సుబ్బారెడ్డి దాతలను సన్మానించారు. కార్యక్రమంలో వల్లం నాగరాజు, భాను, సుధాకర్, సుబ్బయ్య, భాస్కర్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

చాగలమర్రి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అధికారులను ఆదేశించారు. చాగలమర్రి మండల హౌసింగ్ ఏఈగా బాధ్యతలు తీసుకున్న నవీన్ శుక్రవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పక్కా గృహాల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో తాహిర్‌హుసేన్, టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, పార్టీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, సల్లా నాగరాజు పాల్గొన్నారు.

ఏపీ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన మల్లికార్జున

డోన్ టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఏపీ బెస్త సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రజావైద్యశాల మల్లికార్జున శుక్రవారం రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. అనంతరం సుబ్బారెడ్డిని శాలువతో సన్మానించారు.

డెంగీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

డోన్ రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): డెంగీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని కొత్తబురుజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ చంద్రశేఖర్ కోరారు. శుక్రవారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో చిన్నారి బాలికకు డెంగీ కేసు నమోదు కావడంతో గ్రామ వీధుల్లో దోమల నివారణ మందులు పిచికారి చేయించారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ అధికంగా ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

జీవ వైవిధ్యానికి నిలయం నల్లమల

రుద్రవరం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జీవ వైవిధ్యానికి నిలయం నల్లమల అని సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా నరసాపురం నాలుగు రోడ్ల కూడలిలో ఫారెస్టు సిబ్బంది, అధికారులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి రేంజర్ ముర్తుజావలి ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 2 నుంచి వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. వన్యప్రాణులను వేటాడినా వాటికి హానీ తలపెట్టినా 1972 వన్యప్రాణి చట్టం కింద కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్లు శ్రీనివాసరెడ్డి, మక్తర్‌బాషా, రాజెమ్మ, రామకృష్ణ, బీట్ ఆఫీసర్లు హుసేన్‌బాషా పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

బేతంచెర్ల, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 6వ కౌన్సిల్ వార్డులోని ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులను 6వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ పోలూరు ఆదిలక్ష్మి, టీడీపీ నాయకులు పోలూరు విజయ రాఘవ, రామ్ ప్రకాష్ చౌదరి, శేషారెడ్డి పాఠశాల 261వ బూత్ ఇన్‌చార్జి దూదేకుల దస్తగిరి ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో షేక్షావలి, తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె: మండలంలోని జోలాపురం గ్రామంలో టీడీపీ నాయకుడు తిరుమలయ్య శుక్రవారం పలువురు లబ్ధిదారు లకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వంలో ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలు అందజేస్తున్నట్లు తెలిపారు.

గాంధీకి ఘన నివాళి



ముత్యాలపాడులో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

ఉయ్యాలవాడ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ గాంధీని ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీడీవో ఉమామహేశ్వ రరావు అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సర్పంచ్ మేకల ఓబులేసు, గ్రామ కార్యదర్శి జయరామిరెడ్డి పాల్గొన్నారు.

చాగలమర్రి: మహాత్మాగాంధీ ఆశయాలు చిరస్మరణీయమని మాజీ సర్పంచ్ లక్ష్మీరెడ్డి, డెయిరీ చైర్మన్ రమణారెడ్డి, టీడీపీ కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిం చారు. చాగలమర్రి పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ తులశమ్మ, ఈవో తారకేశ్వరి ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు.

కొలిమిగుండ్ల: మహాత్మాగాంధీ కలలుగన్న ఆశయాల సాధ నకు పతి ఒక్కరూ కృషి చేయాలని టీడీపీ ప్రచార కార్యదర్శి కోటపాడు శివరామిరెడ్డి అన్నారు. స్థానిక కొటపాడు గ్రామం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సుంకమ్మ, పంచాయతీ కార్యదర్శి అమరావతి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రుద్రవరం: గాంధీజీ అడుగుజాడల్లో నడుద్దామని డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖరయ్య అన్నారు. తహసీల్దారు కార్యాల యంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిం చారు. వీఆర్వోలు హుసేనీ, నరసింహ, అంకాలయ్య పాల్గొన్నారు.

దుష్ప్రచారం చేస్తే చర్యలు: సీఐ

బనగానపల్లె, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో వర్గాలను రెచ్చగొట్టడానికి దుష్ప్రచారం చేస్తే చర్యలు తీసుకుంటామని బనగానపల్లె సీఐ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన బనగానపల్లె సర్కిల్ కార్యాలయంలో మాట్లాడుతూ యర్రగుడి గ్రామానికి చెందిన రామసుబ్బారెడ్డి మోటార్ సైకిల్‌పై బనగానపల్లెకు వస్తుండగా బత్తులూరుపాడు గ్రామ సమీపంలోకి రాగా వెనుకవైపు నుంచి రెండు మోటార్‌బైక్‌లో వచ్చి తనపై రాళ్లతో దాడి చేశారని ఫిర్యాదు చేశారన్నారు ఈమే రకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తు న్నట్లు తెలిపారు. ఈఘటనకు కారణం వ్యక్తి గత కారణాలు లేదా ఇతర కారణాలు ఉండ వచ్చన్నారు. కాని కొందరు వ్యక్తులు ఈవిషయాన్ని సోషల్ మీడియాలో రాబోయే సర్పంచ్ ఎన్నికల దృష్ట్యా ఈ ఘటన జరిగినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.

విధుల బహిష్కరణ

ఆళ్లగడ్డ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పని చేస్తున్న వైద్యులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. శుక్రవారం అహోబిలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యాధికారులు, పారా మెడికల్ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సుగుణ మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన 99 ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ, ల్యాబ్ టెక్నిషియన్ అనిల్, స్టాఫ్ నర్సు యశోధా, ఫార్మసీ అధికారి వాసవి పాల్గొన్నారు.

కూలిన మట్టిమిద్దె.. మహిళకు స్వల్ప గాయాలు

బేతంచెర్ల, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బైటిపేటలో ఉన్న మట్టిమిద్దె శుక్రవారం కూలింది. అందులో నివాసముంటున్న హుశేన్‌బీకి స్వల్పగాయాలయ్యాయి. ఇంట్లో ఉన్న నిత్యావసర వస్తువులతో పాటు వంట సామగ్రి మట్టిపాలు కావడంతో రూ.60 వేలు నష్టం వాటిల్లిందని బాధితురాలు కన్నీరు మున్నీరయ్యారు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే

డోన్ టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం 11 గంటలకు పట్టణంలోని షాదీ ఖానాలో నిర్వహించనున్న ఆటో డ్రైవర్ల సేవ కార్యక్రమంలో భాగంగా ఆటోడ్రైవర్లకు రూ.15వేలు ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని అందించనుందన్నారు. శనివారం పట్టణంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి విగ్రహం సర్కిల్ నుంచి షాధీఖానా వరకు నిర్వహించనున్న ఆటో ర్యాలీలో అందరూ పాల్గొని జయ ప్రదం చేయాలని కోరారు.

కమనీయం.. వేంకటేశ్వరస్వామి కల్యాణం

చాగలమర్రి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలో శుక్రవారం శ్రవణానక్షత్రం సందర్భంగా వెంకటేశ్వరస్వామి కల్యా ణాన్ని వేద పండితులు అనిల్‌కుమార్ నిర్వహించారు. ఉభయ దారులు ఇంద్రాదేవి, నరేంద్రసాగర్ దంపతులచే శ్రీదేవి, భూదేవి సమేత వెంకటే శ్వర స్వామికి కల్యాణం చేశారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

డోన్ టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని కృష్ణానగర్ వాసులకు రూ.18 లక్షలు వినియోగించి తాగు నీరు అందించారు. రాజేష్ మాట్లాడుతూ ఎవరికైనా తాగునీటి కనెక్షన్ కావాల్సిన టు వంటి వారు మున్సిపాలిటీలో చలానా కట్టి కొళాయి కనెక్షన్ తీసుకోవాలని కోరారు. కార్యక్ర మంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్, పట్టణ యూత్ అధ్యక్షుడు వంశీ, ఏఈ సురేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

దేశ సమైక్యతకు యువత ఏకం కావాలి

కొలిమిగుండ్ల, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): దేశ సమైక్యతకు యువత ఏకం కావాల్సిన అవసరం ఉందని ఆర్ఎస్ఎస్ రాష్ట్ర నేతలు మనోహర్‌జీ, కలూరి చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారంకొలిమిగుండ్లలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా విజయదశమి ఉత్సవం నిర్వహించారు. ఈసందర్భం గా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు సాంప్రదాయ దుస్తుల్లో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్ఎస్ఎస్ నేతలు శ్రీనివాసులు, అంబటి చంద్రశే ఖర రెడ్డి, జయరాముడు యాదవ్ పాల్గొన్నారు.

ఉత్తమ గ్రామ పంచాయతీగా మిట్టపల్లె

బనగానపల్లె, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపల్లె గ్రామం ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపికైనట్లు టీడీపీ నాయకుడు, సర్పంచ్ తులసిరెడ్డి తెలిపారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో సెక్రటరీ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ మాట్లాడుతూ గాంధీ జయంతి సందర్భంగా మిట్టపల్లె ఆదర్శ గ్రామ పంచా యతీగా ఎంపిక కావ డంపై హర్షం వ్యక్తం చేశారు. ఉప సర్పంచ్ హైమావతి, వడిసెల రాముబ్బారెడ్డి, నారపు రెడ్డి, రామసుబ్బారెడ్డి, ఉపేంద్రరెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యనిర్వాహక మండలి సభ్యుడిగా షేక్ బాబులాల్

చాగలమర్రి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామానికి చెందిన వైసీపీ రాష్ట్ర మైనార్టీసెల్ కార్యదర్శి షేక్.బాబులాల్‌ను రాష్ట్ర కార్యనిర్వాహక మండలి సభ్యులుగా పార్టీ అధిష్ఠానం నియమించింది. శుక్రవారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

వ్యక్తిపై దాడి - కేసు నమోదు

ఉయ్యాలవాడ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండంలోని కొండుపల్లె గ్రామానికి చెందిన కాటా నరసింహుడిపై అదే గ్రామానికి చెందిన అహ్మద్ వలి, హైదర్‌వలి, కాశీంలు కలిసి దాడి చేసినట్లు ఏఎస్ఐ ప్రతాప్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు నరసింహుడు తన ద్విచక్ర వాహనాన్ని శుభ్రం చేసిన మురుగు నీరు తమ ఇంటిలోకి వచ్చాయని పైముగ్గురు కలిసి కర్రలతో దాడి చేయగా నరసింహుడు తలకు రక్త గాయమైందన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.